
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రంగారెడ్డి

20

మంగళవారం 22 ఆగస్టు 2017



మహేందర్ గారూ బాగున్నారా?

- ఉప రాష్ట్రపతి పలకరింపు
- బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో రాష్ట్ర మంత్రివర్గం ఘనస్వాగతం



- వివరాలు 19 లో..



సమస్యలు వింటున్న కలెక్టర్

ప్రజావాణికి అధికారులు
తప్పనిసరిగా హాజరుకావాలి

- సమస్యలతో వస్తున్న వారిపట్ల సానుకూలంగా స్పందించాలి
- దరఖాస్తులను 30 రోజుల్లోగా పరిష్కరించాలి
- కలెక్టర్ రఘునందన్‌రావు

7



మాట్లాడుతున్న చెరుకు సుధాకర్

విద్యార్థి లోకం గర్జిస్తే
కేసీఆర్ సర్కార్ పతనం

- విద్యార్థి పోరుగర్జన సభలో తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్
- కల్వకుర్తి నియోజకవర్గ నలుమూల నుంచి తరలివచ్చిన విద్యార్థులు

7 లో

మరుగున పడిన
మరుగుదొడ్లు

- బిల్లులు చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం
- లబ్ధిదారుల లబోదిబో ..
- గత ఏడాది 15,724 మంజూరు
- ఇప్పటి వరకు పూర్తయినవి 3022 మాత్రమే..
- 'స్వచ్ఛభారత్' అభాసు పాలు

स्वच्छ भारत
एक कदम स्वच्छता की ओर



గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం సాధించేందుకు ప్రభుత్వం చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులు జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయి. వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించేందుకు లబ్ధిదారుడికి ప్రభుత్వం రూ. 12వేలు అందజేస్తోంది. మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన డబ్బు సకాలంలో అందకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. బిల్లులు చెల్లించక పోవడంపై ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో అధికారుల తీరుపై ఎమ్మెల్యే యాదయ్యతో పాటు మరికొందరు ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది 15,724 మంజూరు కాగా ఇప్పటి వరకు 3,022 మాత్రమే పూర్తయ్యాయి.

7

శిథిల బడులు

- పెచ్చులూడి సీకులు తేలిన భవనాలు
- పీడిస్తున్న తరగతి గదుల కొరత
- ఐదు తరగతుకు మూడే రూములు
- వరండాలు, చెట్లకిందే చదువులు
- ఆందోళనలో తల్లిదండ్రులు



11

కొందుర్గు, జిల్లేడ్-చౌద రిగూడ మండలాల్లోని పలు పాఠశాలల భవ నాలు శిథిలావస్థకు చేరు కున్నాయి. రేగడి చిల్క మర్రి బడిలో ఐదు తరగ తులకు కేవలం మూడు గదులే ఉన్నాయి. ఒక గదిలో రెండు తరగతు లను, వరండాలో రెండు తరగదులను, మరో తర గతి విద్యార్థులను చెట్ల కింద కూర్చోబెట్టి విద్యాబో ధన చేస్తున్నారు.

మత్స్యశాఖలో
కదలిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



7 లో

- నీళ్లున్న చెరువుల్లోకి చేప పిల్లలు
- సెప్టెంబర్ మొదటి వారంలో వదులుతాం
- టెండర్ ప్రక్రియ పూర్తయింది
- నీరున్న చెరువులను గుర్తిస్తున్నాం
- హోల్‌సేల్ మార్కెట్‌గా శేరిగూడ చేపల పెంపక కేంద్రం
- జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం

ఆంధ్రజ్యోతి/ఇంటర్వ్యూ

బాలికలపై పెచ్చుమీరుతున్న

అత్యాచారాలు

- ఎవరినీ గుడ్డిగా నమ్మొద్దు
- జాగ్రత్తగా ఉండాలి
- తెలిసిన వ్యక్తులే అత్యాచారానికి పాల్పడుతున్నారు
- గత నెలలో జిల్లాలో 14 అత్యాచార కేసులు నమోదు
- మీ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- దేవేందర్, రంగారెడ్డి జిల్లా బాలల పరిరక్షణ అధికారి



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : రోజురోజుకు బాలికలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. తెలిసిన వ్యక్తులే ఈ అత్యాచారాలకు పాల్పడుతున్నారు. అధిక వయస్సు ఉన్నవారే ఈ అఘాయిత్యానికి పాల్పడుతున్న ఘటనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఆడుకుంటున్న బాలికలకు చాక్లెట్ ఇస్తానని, బొమ్మలు కొనిస్తానని ఇలా రకరకాల ఆశలు చూపి ఒంటరి ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగడుతున్నారు. ప్రతి నెలా రంగారెడ్డి జిల్లాలో పది నుంచి 15 కేసులు నమోదవుతున్నాయి. గత నెలలో 14 కేసులు నమోదయ్యాయి. మీ పిల్లలను ఒంటరిగా వదిలి వేయరాదు. ఎక్కడికీ ఒంటరిగా పంపించరాదు. ఇంట్లో పిల్లలు ఒంటరిగా ఉన్నప్పుడు తలుపులు వేసుకోవాలనే విషయంతో పాటు పలు జాగ్రత్తలు వివరించాలి. బాలికలను వదిలి తల్లిదండ్రులు బయటకు వెళ్లినా, బంధువుల ఇళ్లకు, ఫంక్షన్లకు వెళ్లినా పక్కింటి వారికి అప్పగించి వెళ్లరాదు. సాధ్యమైనంత మేరకు వెంట తీసుకుని వెళ్లడమే మంచిది. ఈ విషయాన్ని ప్రతి తల్లిదండ్రులు గమనించాలి. బాలికలను ట్యూషన్‌కు పంపించాలనుకునే తల్లిదండ్రులు ప్రధానంగా మహిళా టీచర్‌ను ఎంచుకోవాలి. తప్పని పరిస్థితుల్లో పురుష టీచర్‌ను ఎంపిక చేసుకుంటే... ట్యూషన్‌కు వెళ్లే సమయంలో వెంట వెళ్లాలి. తిరిగి ఇంటికి వచ్చే వరకు ఓ కంట కనిపెట్టాలి. పిల్లలు స్కూలుకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయాన్ని ఖచ్చితంగా చూసుకోవాలి. ఏమాత్రం ఆలస్యం జరిగినా అప్రమత్తం కావాలి. నేడు సోషల్ మీడియా ప్రభావం పెరిగి పోయింది. మీ పిల్లలకు స్మార్ట్ ఫోన్లు కొనివ్వొద్దు. ఒకవేళ కొనిచ్చినా ఇంటర్నెట్ సౌకర్యం లేకుండా జాగ్రత్తపడాలి. అన్‌లిమిటెడ్ నెట్ అందుబాటులోకి రావటంతో పిల్లలు పాడైపోతున్నారు. కొంతమంది పిల్లలు అశ్లీల చిత్రాలకు ఆకర్షితులై చెడు మార్గాలు అనుసరిస్తున్నారు. సోషల్ మీడియాలోని అశ్లీలాలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇప్పటివరకు నమోదైన అత్యాచార కేసుల్లో బాలికలవే ఎక్కువగా ఉన్నాయి. బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ పొందేందుకు ప్రభుత్వం చట్టాన్ని రూపొందించి, ఈ చట్టంపై అవగాహన కల్పిస్తున్నాం. చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉన్నప్పుడే నేరాలు, ఘోరాలు కూడా తగ్గేందుకు అవకాశముంది. చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవటం నేరం. బడీడు పిల్లలంతా బడిలోనే ఉండాలి. 14 ఏళ్లలోపు పిల్లలచే ఎలాంటి పనిచేయించినా చట్టరీత్యా నేరం.

డబుల్ లైన నిర్మాణంతో తీరనున్న కష్టాలు

- మెరుగుపడనున్న రైలు ప్రయాణం

వర్తమానం

మేడ్చల్ : మేడ్చల్ జిల్లా ప్రజలు నగరానికి వెళ్లేందుకు రైలు ప్రయాణం మరింత సులభతరం కానుంది. నిజాం కాలంలో నిర్మించిన సికింద్రాబాద్-నాందేడ్ రైల్వే మార్గం వయా మేడ్చల్ మీదుగా నిర్మించిన సింగిల్ రైల్వే మార్గాన్ని ప్రస్తుతం డబుల్ రైల్వే లైనుగా ఆధునీకరిస్తున్నారు. దీనితో మేడ్చల్ ప్రజలకు నగరానికి వెళ్లేందుకు రైల్వే ప్రయాణం మరింతగా మెరుగుపడనుంది. ప్రస్తుతం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. సికింద్రాబాద్ నుంచి బొల్లారం వరకు డబుల్ లైనుతో పాటు ఎలక్ట్రికల్ లైను కూడా ఉండటంతో అక్కడి వరకు లోకల్, ఎంఎంటీఎస్‌తో పాటు అన్ని రైళ్లు వేగవంతంగా నడుస్తున్నాయి. బొల్లారం నుంచి మేడ్చల్ వరకు సింగల్ లైను మాత్రమే ఉండటంతో డీజిల్‌తో రైళ్లు నడిపిస్తున్నారు. క్రాసింగ్‌లు కూడా ఎక్కువ కావడంతో మేడ్చల్ నుంచి సికింద్రాబాద్‌కు 27 కిలోమీటర్ల దూరం ఉండగా, రైలు ప్రయాణం గంటన్నర పైగా పడుతోంది. దీంతో మేడ్చల్ ప్రజలు నగరానికి వెళ్లేందుకు రైలు ప్రయాణం చేయడానికి ఎక్కువగా మొగ్గు చూపడం లేదు. ప్రతి రోజు క్రమం తప్పకుండా పాల వ్యాపారులతో పాటు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు మాత్రమే వెళ్తున్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో మేడ్చల్ వరకు రెండో దశ కింద నిధులు మంజూరు చేయడంతో ప్రస్తుతం పనులు చురుకుగా సాగుతున్నాయి. బొల్లారం నుంచి మేడ్చల్ వరకు డబుల్‌లైన్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. మండల పరిధిలోని మేడ్చల్, గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి రైల్వేస్టేషన్ల వద్ద, అయోధ్య, మేడ్చల్, గౌడవెల్లి, గుండ్లపోచంపల్లి గేట్ల వద్ద నూతన గదులు నిర్మించారు. విద్యుద్దీకరణ కోసం ట్రాక్‌కు ఇరువైపులా స్తంభాలు ఏర్పాటు చేసి తీగలు లాగే పనులు నడుస్తున్నాయి. డబుల్ లైన్, ఎలక్ట్రిక్ పనులు పూర్తయితే నగరానికి వెళ్లేందుకు ప్రయాణ సమయం తగ్గుతుంది. మేడ్చల్ నుంచి సికింద్రాబాద్‌కు రైల్వే రూట్ దూరం 27 కిలోమీటర్లు. మేడ్చల్ నుంచి బొల్లారం వరకు రైల్వేలైను సింగిల్‌లైన్, విద్యుత్ లైన్ కాకపోవడంతో ప్రయాణ సమయం గంటకు పైగా పడుతోంది. మేడ్చల్ వరకు ఎంఎంటీఎస్, లోకల్ రైళ్లు, నాందేడ్, నిజామాబాద్, షిర్డీ, అజంతా వంటి ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. దీనితో క్రాసింగ్‌ల కోసం లోకల్ రైళ్లను నిలిపివేస్తుండటంతో ప్రయాణ సమయం ఎక్కువ అవుతున్నది. డబుల్ లైన్ పనులు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గనుండడంతో మేడ్చల్ ప్రజలు రైలు ద్వారా నగరానికి వెళ్లేందుకు ఆసక్తి చూపే అవకాశం ఉంది. ఇటీవల మేడ్చల్ జాతీయ రహదారిపై విపరీతమైన ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొంటున్నాయి. గతంలో నగరం నుంచి మేడ్చల్‌కు వచ్చేందుకు బోయిన్‌పల్లి దాటితే చాలు ప్రయాణం సులువుగా ఉండేది. పావుగంటలో మేడ్చల్‌కు చేరుకునేవారు. ప్రస్తుతం రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌తో బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్‌కు రావాలంటే అడుగడుగునా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ క్రమంలో పట్టణ ప్రజలు రైల్వే ప్రయాణంవైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. డబుల్ లైను పూర్తయి నగరానికి వెళ్లేందుకు విస్తృతంగా రైలు సౌకర్యం ఉంటే పట్టణ ప్రజలు ఎక్కువగా రైలు ప్రయాణం వైపు మొగ్గు చూపుతారు.



గుండ్లపోచంపల్లి, గౌడవెల్లి గ్రామాల వద్ద చురుకుగా నడుస్తున్న డబుల్ లైను పనులు



మేడ్చల్ రైల్వేస్టేషన్ వద్ద చురుకుగా సాగుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు



రైల్వే లైను పక్కన నిర్వహిస్తున్న డ్రైనేజీ పనులు

డబుల్ లైన్ నిర్మాణం పూర్తయితే సౌకర్యవంతంగా ఉంటుంది



డబుల్ లైను నిర్మాణం పూర్తయితే మేడ్చల్ నుంచి నగరానికి వెళ్లేందుకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. ట్రాఫిక్‌తో సంబంధం లేకుండా నేరుగా నగరానికి చేరుకోవచ్చు. మేడ్చల్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం కూడా ఉంటుంది.

-శైలేందర్, మేడ్చల్

అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి



మేడ్చల్ రైల్వేలైను డబుల్ లైను చేయడంతో పాటు మేడ్చల్ రైల్వే స్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి. మేడ్చల్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వారు రాకపోకలు సాగించాలంటే సికింద్రాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. మేడ్చల్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేవిధంగా కృషి చేయాలి.

-విష్ణుచారి, మేడ్చల్

దేవుళ్లకు అరటి, కొబ్బరి ఎందుకు సమర్పిస్తారు?



పెద్దేముల్ : అరటి, కొబ్బరి కాయలు మాత్రమే దేవుళ్లకు సమర్పిస్తారు. ఎన్ని ఫలాలు ఉన్నా భగవంతునికి సమర్పించడానికి అరటి, కొబ్బరికాయలకే ప్రాధాన్యం. ఎందుకంటే వాటికి పూర్ణ ఫలాలు అనే పేరుంది. దీనికి కారణం ఉంది. సృష్టిలో అన్ని ఫలాలను మనం ఆరగించి, వాటిలోని విత్తనాలను నోటి నుంచి తీసేస్తాం. దాని వల్ల ఆ విత్తనాలు ఎంగిలి పడతాయి. కొన్ని పండ్లను పక్షులు తిని, వాటి విత్తనాలను విసర్జిస్తాయి. అవి మొలకెత్తి పుష్పించి ఫలిస్తాయి. అది అంత శ్రేష్ఠం కాదు. అరటి, కొబ్బరి చెట్టు విషయంలో అలా జరగదు. మహా పతివ్రత సావిత్రిదేవి శాపవశాత్తు భూలోకంలో అరటిచెట్టుగా జన్మించిందని అంటారు. అరటి చెట్లు విత్తనాల ద్వారా కాకుండా పిలకల ద్వారా మొలిచి పండ్లను ఇస్తాయి. కొబ్బరి చెట్టు విత్తనం కలిగిన చెట్టే అయినా, దానికి ఎంగిలి దోషం అంటదు. అందుకే అరటిపండ్లు, కొబ్బరికాయలు పూర్ణ ఫలాలయ్యాయి. అందువల్ల దేవుళ్లను కొలిచేటప్పుడు అరటిపండ్లతో నైవేద్యం తప్పక ఇస్తారు.



వరదరాజు జోషి, అర్చకుడు

ఏకీకృత సర్వీసు రూల్స్‌ను అమలు చేయాలి

- వేణుగోపాల్, టీఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, వికారాబాద్ జిల్లా

ఉద్యోగపర్వం



కొడంగల్: ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు కోసం రెండు దశాబ్దాలుగా పోరాటం కొనసాగిస్తున్నా అమలు చేయడంలో ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. ఏకీకృత సర్వీసు రూల్స్‌లో భాగంగా పంచాయతీరాజ్, ప్రభుత్వ ఉపాధ్యాయులను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చేందుకు జూన్ చివరి వారంలో రాష్ట్రపతి ఆమోదం తెలిపినా ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమౌతోంది. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుతో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు, జూనియర్ అధ్యాపకులు, మండల విద్యాధికారుల పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంటుంది. దీంతో పాఠశాలల పర్యవేక్షణతో విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించేందుకు దోహదపడుతుంది. ప్రస్తుతం ఇన్‌చార్జిల పాలనతో పాఠశాలల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి విద్యాభివృద్ధి కుంటపడే అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో ప్రతి నెల పదోన్నతులు కల్పించినా, రాష్ట్రం ఏర్పడి 3 సంవత్సరాలు గడుస్తున్నా ఎలాంటి పదోన్నతులను చేపట్టకపోవడం ఉపాధ్యాయులకు తీరని అన్యాయానికి గురి చేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని దసరా సెలవుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టి విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించాలి.

నమ్మించి ఏటీఎం కార్డు చోరీ..

ఖాతా నుంచి రూ1.40లక్షలు స్వాహా

కొత్తూరు : ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేయడం తెలియని ఓ వ్యక్తిని గమనించిన గుర్తు తెలియని అగంతకుడు డబ్బులు డ్రా చేసి ఇస్తానని నమ్మించి అతడి నుంచి ఏటీఎం కార్డును తస్కరించి మరుసటి రోజు సదరు వ్యక్తి ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్తూరు ఎస్ఐ శ్రీశైలం కథనం ప్రకారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన స్వాహిన్ పది రోజుల కిందట కొత్తూరులోని బంధువుల వద్దకు వచ్చాడు. అయితే పది రోజుల క్రితమే కొత్తూరు ఎస్‌బీఐ ఏటీఎం వద్దకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకునేందుకు ప్రయత్నించాడు. అతడికి డబ్బులు డ్రా చేయడానికి రాకపోవడంతో అది గమనించిన ఓ అగంతకుడు తాను డబ్బులు డ్రా చేయిస్తానని అతని వద్ద నుంచి ఏటీఎం కార్డు తీసుకుని ప్రయత్నం చేసి డబ్బులు డ్రా కావడం లేదని తిరిగి కార్డును ఇచ్చాడు. అయితే అతను డూప్లికేట్ కార్డు ఇచ్చి స్వాహిన్‌కు చెందిన ఒరిజినల్ కార్డును తస్కరించాడు. మరుసటి రోజు తిమ్మాపూర్ ఎస్‌బీఐ ఏటీఎం నుంచి సదరు అగంతకుడు రూ.15వేలు డ్రా చేశాడు. తర్వాత ఆన్‌లైన్ ద్వారా మరో లక్షా 25వేల రూపాయలను వేరే ఖాతాలోకి మార్చుకున్నాడు. అయితే తన ఖాతా నుంచి డబ్బులు డ్రా అవుతున్న విషయాన్ని గమనించిన స్వాహిన్ సోమవారం కొత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు.

ఇంటి తాళాలు పగలగొట్టి నగలు, నగదు..

షాద్‌నగర్ రూరల్ : షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎలికట్ట గ్రామానికి చెందిన ఆర్ల బాల్‌రాజ్ ఇంట్లో ఈనెల 19న చోరీ జరిగినట్లు ఏఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. 19న అత్తగారి ఊరు విర్యాలకు కుటుంబ సభ్యులతో వెళ్లగా అదేరోజు రాత్రి గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి రెండు తులాల బంగారం, రూ.30వేల నగదు, 30 తులాల వెండి అపహరించుకుపోయినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

కొత్తూరు : తిమ్మాపూర్ వద్ద సోమవారం ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. షాద్‌నగర్ నుంచి తిమ్మాపూర్‌కు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం



షాద్‌నగర్ రూరల్ : షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బూర్గుల గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఏఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం గ్రామానికి చెందిన జయమ్మ(34) ఈనెల 17న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. భర్త నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

'సీఎస్‌కే' వెంచర్‌పై విచారణ జరపండి

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ పట్టణ శివారులోని సీఎస్‌కే వెంచర్‌ను 125 ఎకరాల్లో ఏర్పాటు చేశారని, కాగా వెంచర్‌లో మున్సిపాలిటీకి పదిశాతం స్థలాన్ని కేటాయించలేదని గ్రామ పంచాయతీ మాజీ సభ్యులు ఆకుల శ్రీనివాస్, గంతల ప్రభు, రవియాదవ్, సయ్యద్ ఖమర్‌లు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. 125 ఎకరాల్లో కనీసం 12 ఎకరాలు పదిశాతం స్థలానికి ఇవ్వాల్సి ఉండగా ఆ స్థలంలో రోడ్లు వేసి చెట్లు నాటారని తెలిపారు. హెచ్ఎండీఏ ద్వారా లేఅవుట్ చేసిన ఈ వెంచర్‌పై సమగ్ర విచారణ జరిపి పదిశాతం స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని వారు కోరారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

టీడీపీ రాజ్యసభ సభ్యుడు దేవేందర్‌గౌడ్



ఎంపీ నిధుల ప్రొసీడింగ్‌ను గ్రామస్థులకు అందజేస్తున్న ఎంపీ దేవేందర్‌గౌడ్

మహేశ్వరం : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులందరు రాజకీయాలకతీతంగా ప్రజలతో మమేకమై ముందుకుసాగినప్పుడే ఆ గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందుతాయని ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం హర్షగూడ గ్రామాభివృద్ధికి దేవేందర్‌గౌడ్ నిధుల నుంచి రూ.20 లక్షల ప్రొసీడింగ్‌ను గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని హర్షగూడ గ్రామాన్ని తాము దత్తత తీసుకున్నందున ఆ గ్రామాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే కొన్ని నిధులు విడుదల చేశామని, ప్రస్తుతం మరో రూ.20 లక్షల నిధులను మంజూరు చేశామన్నారు. అదే విధంగా రోజు రోజుకు నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందని ఆ సమస్యను అధిగమించాలంటే పిల్లలందరిని ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్‌నాయక్, ఎం.వీరేష్, యాదయ్య, బాలయ్యగౌడ్‌లు పాల్గొన్నారు.

వామ్మో.. షాద్‌నగర్ ఠాణా

- తరచూ వివాదాలు.. ఆరోపణలు
- పూర్తికాలం పనిచేయకుండానే బదిలీలు



షాద్‌నగర్ రూరల్ : ఒకప్పుడు షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్ కోసం కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ, సీఐ వరకు పెద్దఎత్తున పైరవీలు చేసి పోస్టింగ్ దక్కించుకునేవారు. షాద్‌నగర్ మీదుగా జాతీయ రహదారి ఉండడమే కాకుండా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతిచేరువలో ఉంది. అంతేకాకుండా వేగంగా అభివృద్ధి చెందడంతోపాటు అంతే స్థాయిలో నేరాలు జరుగుతుంటాయి. దీంతో ఇక్కడ పనిచేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం షాద్‌నగర్ ఠాణాలో పనిచేయాలంటేనే హడలిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. వివాదాలు, రాజకీయ జోక్యం వల్ల ఒక్కరు కూడా పట్టుమని రెండేళ్లు పనిచేయడం లేదు. షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సైదయ్య నుంచి ప్రస్తుతం కమిషనరేట్‌కు అటాచ్ చేయబడిన శ్రీనివాసచారి వరకు అదే పరిస్థితి. షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా శంకరయ్య హయాంలో శాంతిభద్రతలు చాలావరకు అదుపులోకి వచ్చాయి. నేరాల నియంత్రణ, దొంగతనాలు తగ్గుముఖం పట్టాయి. ముఖ్యకూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతోపాటు పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. రాత్రిపూట పెట్రోలింగ్ విస్తృతంగా చేయడంతో దొంగతనాలు తగ్గుముఖం పట్టాయి. చివరకు వివాదాల కారణంగా 15 నెలలకే బదిలీపై వెళ్లారు. తర్వాత వచ్చిన రామకృష్ణ ఏడాది గడవకముందే బదిలీ అయ్యారు. ప్రస్తుతం బదిలీపై వెళ్లిన శ్రీనివాసచారి కేవలం 3 నెలల 15 రోజులు మాత్రమే పనిచేశారు. కింది స్థాయి సిబ్బందితో సమన్వయంతో పనిచేయించకపోవడమే కాకుండా ఎస్ఐ దాసు, ఆయన ఘర్షణ పడ్డారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉండడంతో సీఐ, ఎస్ఐలను కమిషనర్ బదిలీ చేశారు. రాజకీయ జోక్యం ఎక్కువగా ఉండడం వల్ల విధులు నిర్వహించడం కష్టంగా మారుతుందనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు సీఐల స్వయం కృతాపరాధం వల్ల కూడా బదిలీ వేటు పడిన సందర్భాలు ఉన్నాయి.

నెలరోజుల నుంచి సీఐ బదిలీకి ప్లాన్

షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి బాధ్యతలు తీసుకుని మూడు నెలల 15 రోజులు అవుతుంది. అయితే నెల రోజుల నుంచే ఆయనను బదిలీ చేసేందుకు ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇటీవల ఎస్‌వోటీ పోలీసులు పట్టణంలోని పలు దుకాణాలపై దాడులుచేసి నిషేధిత గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ విషయంలో కూడా నాయకులకు, ఆయనకు వైరం పెరిగినట్లు తెలిసింది. దీంతో అప్పటి నుంచి బదిలీ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పలుమార్లు హోంమంత్రిని కోరినట్లు సమాచారం.

అప్పుడు ఎస్ఐగా, ఇప్పుడు ఇన్‌స్పెక్టర్‌గా..

ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి రెండు పర్యాయాలు వివాదాల కారణంగానే బదిలీపై వెళ్లారు. గతంలో షాద్‌నగర్ సీఐగా సైదయ్య ఉండగా ఎస్ఐగా శ్రీనివాసచారి పనిచేశారు. సమన్వయంతో పనిచేయకుండా ఇద్దరు పోలీస్‌స్టేషన్‌లోనే గొడవ పడడంతో అప్పటి పాలమూరు ఎస్పీ ఇద్దరినీ బదిలీ చేశారు. ప్రస్తుతం ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న శ్రీనివాసచారి తనకింద పనిచేసే ఎస్ఐ దాసుతో గొడవపడి అది కమిషనర్ దృష్టికి వెళ్లడంతో ఇద్దరినీ బదిలీచేశారు.

ఆదాయం పైనే ఆశ..

సౌకర్యాలపై ఏది ధ్యాస

- విస్తరణకు నోచుకోని ఆమనగల్లు బస్టాండ్
- సదుపాయాలు లేక ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు



అసౌకర్యాలతో ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్

ఆమనగల్లు: ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌లో సరైన సదుపాయాలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు మండలాల ప్రధాన కూడలిగా, శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిని అనుసరించి ఉన్న బస్టాండ్‌లో ప్రయాణికులకు కనీస సదుపాయాలు లేవు. నిత్యం వందల బస్సులు, వేలమంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, అభివృద్ధి విషయంలో ఎవరు చొరవ చూపడం లేదు. బస్టాండ్ నానాటికి వ్యాపార సముదాయంగా మారి ఇరుకుగా తయారైంది. ఆమనగల్లు బస్టాండ్ మీదుగా హైదరాబాద్-శ్రీశైలం, యాదగిరిగుట్ట, వరంగల్, సంగారెడ్డి, నర్సంపేట, మాల్, దేవరకొండ, అచ్చంపేట, మహబూబ్‌నగర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కర్నాటక వంటి దూర ప్రాంతాలకు నిత్యం వందల సంఖ్యలో బస్సులు నడుస్తుంటాయి. 2003లో ప్రారంభించిన ఈ బస్టాండ్‌లో నేటికి సరైన సదుపాయాలు సమకూర్చకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది. బస్టాండ్ విస్తరణ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులెవరు పట్టించుకోవడం లేదని స్థానికులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు ఆదాయంపై చూపుతున్న శ్రద్ధ సౌకర్యాలు కల్పించడంలో చూపకపోవడం విమర్శలకు తావిస్తుంది. ప్రజాప్రతినిధులు కూడ బస్టాండ్ విస్తరణ, ప్రయాణికుల సౌకర్యాల కల్పన విషయంలో చొరవ చూపడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రయాణికుల సంక్షేమమే తమ ధ్యేయమని గొప్పగా ప్రకటించుకునే ఆర్టీసీ దానికనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదనడానికి ఆమనగల్లు బస్టాండ్ నిదర్శనంగా నిలిచింది.

ఇవీ సమస్యలు..

బస్టాండ్‌లో ప్రయాణికులకు తాగునీటి వసతి లేదు. వాసవీక్లబ్ నిర్మించిన మినీ ట్యాంక్‌కు కుళాయి కనెక్షన్ తొలగించడంతో నిరుపయోగంగా మారింది. ప్రయాణికులు నీటి ప్యాకెట్లు కొని దాహం తీర్చుకుంటున్నారు. దీంతో ప్రధాన రహదారిపై టీ, టిఫిన్స్‌కు వస్తుండడంతో సామాగ్రికి రక్షణ లేకుండాపోతుంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ప్రయాణికులు విసర్జనకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌లో కంట్రోలర్ లేక బస్సుల రాకపోకల సమాచారం తెలవడం లేదు. ప్లాట్‌ఫారాలు చాలినన్ని లేక ఏ బస్సు ఎక్కడికి పోతుందో తెలియక ప్రయాణికులు అయోమయానికి లోనవుతున్నారు. కూర్చోవడానికి బెంచీలు, సదుపాయాలు లేవు. బస్టాండ్‌లో పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనాలను ప్రధాన రహదారి పక్కన నిలిపి వెళ్లాల్సివస్తుంది. సరైన వీధి దీపాలు కూడా లేవు.

బస్టాండ్‌ను విస్తరించాలి..



ఆమనగల్లు బస్టాండ్‌ను ప్రయాణికులు, బస్సుల రాకపోకలకనుగుణంగా విస్తరించాలి. జిల్లాకు చెందిన మంత్రి మహేందర్‌రెడ్డి ఆర్టీసీ మంత్రిగా ఉన్నందున బస్టాండ్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి.

-గోరటి నర్సింహ్మా, బీజేపీ జిల్లా కార్యదర్శి, ఆమనగల్లు

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి: ఎస్‌ఐ

చేవెళ్ల రూరల్ : వినాయక మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చేవెళ్ల ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో అన్ని పార్టీల నాయకులు, అధికారులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.... గణేశ్ మండపాలకు పోలీసుల అనుమతి కచ్చితంగా తీసుకోవాలని సూచించారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎంపీపీ బాల్‌రాజ్, తహసీల్దార్ గోపీరామ్, ఎంపీ డీవో రత్నమ్మ, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

- శ్రావణ మాసం చివరి సోమవారం, అమావాస్య ఉండడంతో పోటెత్తిన భక్తులు

చేవెళ్ల రూరల్ : శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, కొనగట్టు శివాలయం, మల్కాపూర్‌లోని మల్లికార్జున దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి పంచామృత అభిషేకం, తులసీ సహస్రనామార్చన కార్యక్రమాలతో పూజలు చేశారు. శివాలయాల్లో శివునికి భక్తులు పాలు, నీళ్లతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దీంతో అన్ని దేవాలయాలు భక్తులతో నిండిపోయాయి. అలాగే శ్రీ లక్ష్మీవెంకటేశ్వర దేవాలయం గోవింద నామస్మరణతో మారుమ్రోగింది. స్వామివారి సేవా కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దేవుని వామనాచార్యులు, దేవస్థానం ఈవో శ్రీనివాసులు, పూజారులు దేవుని రమకాంత్, ఆయా దేవాలయాల నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌లో: శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. శ్రావణ మాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని కనకమామిడి సంఘమేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సంఘమేశ్వర స్వామివారికి, భ్రమరాంబ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అన్నపూజ, ఆకు పూజ నిర్వహించారు. అభిషేకాలు చేశారు. మహా మంగళహారతి నిర్వహించారు. ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. చివరి సోమవారంతో పాటు అమావాస్య ఉండటంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని నాగలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


చేవెళ్లలోని శివాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు


కనకమామిడి సంఘమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు


మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ వీరభద్రయ్య

'విద్యార్థుల్లో పరివర్తన తీసుకురావాలి'

చేవెళ్ల రూరల్ : విద్యార్థుల్లో పరివర్తన తీసుకురావటానికి ప్రతి ఉపాధ్యాయుడు వారిలో మానవతా విలువలు పెంపొందించాలని సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ముదిగొండ వీరభద్రయ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మానవతా విలువలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో రోజురోజుకు దిగజారుతున్న విలువల పెంపునకు బాబా చూపిన మార్గమే పరిష్కారమని చెప్పారు. సత్యం, ధర్మం, శాంతి, అహింస, ప్రేమలను పెంపొందించటానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలని పేర్కొన్నారు. జిల్లా బాలవికాస్ కో-ఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ.. బాల్యంలోనే మానవతా విలువలను బోధిస్తే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దొచ్చని అన్నారు. సమావేశంలో బాల వికాస్ గురువులు రేవతిరెడ్డి, జహార్‌లక్ష్మీ, విష్ణువర్ధన్‌రావు, జిల్లా అడ్వయిజర్ రామన్న, హరినాథ్‌రెడ్డి, సేవా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు, లెక్చరర్స్ తదితరులు పాల్గొన్నారు.

'రుబెల్లా వ్యాక్సిన్ తప్పనిసరి'

షాబాద్ : పిల్లలకు రుబెల్లా వాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని, ఇది వారి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని కుర్వగూడ సర్పంచ్ సంధ్యారాణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కుర్వగూడ పాఠశాలలోని విద్యార్థులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో: తట్టు, రుబెల్లా కోసం వ్యాక్సినేషన్ వేయించాలని కొండకల్ ఎంపీటీసీ బద్దం జ్యోతి పేర్కొన్నారు. కొండకల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వ్యాక్సినేషన్ వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయుడు అశోక్, నాయకులు పాల్గొన్నారు.

నేడు పీఆర్‌టీయూ టీఎస్ సమావేశం

షాబాద్ : నేడు మండల కేంద్రంలో పీఆర్‌టీయూ టీఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు పల్లె ఆనంద్‌కుమార్‌యాదవ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ... మంగళవారం మధ్యాహ్నం 12.30 నిమిషాలకు పీఆర్‌టీయూ నూతన భవన ఆవరణలో సమావేశం ఉంటుందన్నారు. పీఆర్‌టీయూ ప్రాథమిక సభ్యులు, మహిళా ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

'బీజేపీని బలోపేతం చేస్తాం'

షాబాద్ : బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల బీజేపీ మదిరాజ్ సెల్ కన్వీనర్‌గా మహేష్‌ముదిరాజ్‌ను నియమించినట్లు తెలిపారు. మహేష్‌ముదిరాజ్ మాట్లాడుతూ.... పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు రాము, ఆర్‌టీఐ సెల్ జాయింట్ కన్వీనర్ కిరణ్‌కుమార్, చేవెళ్ల అసెంబ్లీ ఆర్‌టీఐ కన్వీనర్ రాజేందర్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షులు హరీష్‌ముదిరాజ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు ఉన్నారు.

'మొక్కలు నాటి సంరక్షించుకోవాలి'

చేవెళ్ల రూరల్ : మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని సాయిచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి తెలిపారు. హరితహారంలో భాగంగా సోమవారం పాఠశాలలో మొక్కలు నాటారు.

'దుకాణాలకు వెంటనే రీటెండర్ నిర్వహించాలి'

శంకర్‌పల్లి: దొడ్డిదారిలో పంచాయతీ దుకాణాలను రెన్యువల్ చేయడం అధికారులు మానుకోవాలని బీజేపీ చేవెళ్ల నియోజకవర్గ పార్లమెంటు ఇన్‌చార్జి ప్రభాకర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ రాములుగౌడ్ హితవు పలికారు. శంకర్‌పల్లి పంచాయతీ దుకాణాలకు వెంటనే రీటెండర్ నిర్వహించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఈవో ఆర్‌డీ నర్సింగ్‌రావులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారులు, పాలకులు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో సిబ్బంది జీతాలు చెల్లించలేని దుస్థితికి పంచాయతీ చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా రూ. 15వేల నుంచి 20వేలు రావాల్సిన దుకాణాలకు అప్పట్లో దుకాణాలను స్వంతం చేసుకున్న వారు వెయ్యి చెల్లిస్తూ చేతులు దులుపుకుంటున్నా పంచాయతీ అధికారులు కాసులకు కక్కుర్తిపడి కిమ్మనడం లేదని ఆరోపించారు. అధికారులు, పాలకులు ఎలాంటి అడ్డదారులు తొక్కినా, రీటెండర్ నిర్వహించకపోతే తాము ఈవిషయాన్ని విడిచిపెట్టేది లేదని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటుగా రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.


ఈవోఆర్‌డీ నర్సింగ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

'పంచాయతీ ఆదాయాన్ని కాపాడండి'

శంకర్‌పల్లి: పంచాయతీ దుకాణాలకు వెంటనే టెండర్ నిర్వహించాలని హిందూ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శంకర్‌పల్లి పంచాయతీ దుకాణాలకు రీటెండర్ వెంటనే నిర్వహించాలని కోరుతూ సోమవారం ఆయన డీపీవో పద్మజారాణికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శంకర్‌పల్లి పంచాయతీ దుకాణాలకు రీటెండర్ నిర్వహించాని ఆదేశించినా క్రింది స్థాయిలో అది అమలుకు నోచుకోవడం లేదని ఆమె దృష్టికి తెచ్చినట్లు తెలిపారు. కొంత మంది పాలకులు, దుకాణదారులు ఈవోఆర్‌డీపై ఒత్తిడి తెచ్చి వాటిని ఆపుతున్నారని పేర్కొన్నారు. దుకాణానికి రూ. 5వేల నుంచి 8 వేల వరకు పెంచి దుకాణాలను రెన్యువల్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. పైరవీలకు ఆస్కారం లేకుండా డీపీవోనే దగ్గరుండి రీటెండర్ నిర్వహించి పంచాయతీ ఆదాయాన్ని కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. లేకుంటే శంకర్‌పల్లి గ్రామపంచాయతీని దేవుడు కూడా కాపాడలేడని ఆందోళన వ్యక్తం చేశారు. దుకాణాలు పూర్తిగా పరులపాలు అయ్యే ఆస్కారం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనతో పాటుగా అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

'విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి'


తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

శంకర్‌పల్లి: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి డిమాండు చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రజలకు నిజాం నవాబు నుంచి స్వేచ్ఛ లభించిన రోజును ప్రభుత్వం విస్మరించడం విడ్డూరంగా ఉందని అన్నారు. తెలంగాణ రాక ముందు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ఆందోళన చేసిన టీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మరువడం బాధాకరమన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల మనసును గుర్తెరిగి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాములుగౌడ్, నర్సింహారెడ్డి, జైరాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, నర్సింహులు, కుమార్, రాంసింగ్ తదితరులు ఉన్నారు.

గణేష్ నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలి: సీఐ సునీత

మొయినాబాద్: గణేష్ నవరాత్రులను శాంతియుతంగా జరుపుకోవాలని మొయినాబాద్ సీఐ సునీత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో సీఐలు నయీమ్, గోన్యానాయక్, సర్పంచ్ రమేష్ వివిధ గ్రామాల నాయకులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సునీత



పశువులకు నట్టల నివారణ మందు

కొనాపూర్ గ్రామంలో సోమవారం క్రీమ్‌లైన్ జెర్సీ వారి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సంస్థ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో 90 పశువులకు గర్భధారణ పరీక్షలు చేసి, నట్టలనివారణ మందులు అందజేశారు, చేశారు. జెర్సీ మేనేజర్ భాస్కర్, సూపర్‌వైజర్ కురుమయ్య, ఎజెంట్, ఈదమయ్య, రైతులు ఎట్టయ్య, మల్లయ్య, యాదయ్య గౌడ్, వెంకటయ్య, పర్వతాలు, నారయ్య పాల్గొన్నారు. -(ఆమనగల్లు)

చవితి ఉత్సవాలకు సన్నద్ధం



విక్రయానికి సిద్ధంగా వినాయక ప్రతిమలు, వివిధ ఆకారాల్లో గణపతులు

ఆమనగల్లు: వినాయకచవితి వేడుకలకు ఊరువాడా ముస్తాబవుతున్నాయి. ఈనెల 25నుండి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రోత్సవాలకు ఉత్సవ కమిటీలు సన్నద్ధమవుతున్నాయి.ఆమనగల్లు పట్టణంతో పాటు ఉమ్మడి మండలంలోని అన్ని గ్రామాలలో గణేష్ ఉత్సవాలు ప్రతియేటా అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. గణనాథుల విగ్రహాల ఏర్పాటుకు పట్టణంతో పాటు గ్రామాల్లో మండపాలు సిద్ధమవుతున్నాయి. గణేశ్ నవరాత్రోత్స వాలను ఉత్సవకమిటీలు, యువజన సంఘాలు, కాలనీసంఘాలు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నాయి. మండపాల మొదలు నిమజ్జనం వరకు ఇప్పటికే ఏర్పాట్ల కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. ఒకరికంటే ఒకరు తీసిపోని విధంగా మండపాల అలంకరణలు, గణనాథుల ప్రతిమలు విభిన్నంగా ఉండాలని ఉత్సాహం కనబరుస్తున్నారు. ప్రతియేటా పట్టణంలో చిన్నా పెద్ద 50 వరకు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేది. కాగా ఈ యేడాది వర్షాభావ పరిస్థితులు, పోలీసుల ఆంక్షలు, చందాల వసూళ్ల కాక గణేష్ నవరాత్రోత్సవాలపై కనిపిస్తోంది. ఆమనగల్లు, కడ్తాల పట్టణాలలో విక్రయానికి ఇప్పటికే కొందరు వ్యాపారులు హైద్రాబాద్‌నుండి విగ్రహాలను తీసుకువచ్చి విక్రయానికి సిద్ధం చేసుకుంటున్నారు. పెరిగిన ముడిసరుకుల, రసాయనాల ధరల నేపథ్యంలో గణనాథుల ప్రతిమల ధరలు కొండెక్కాయి. గతేడాదితో పోలిస్తే ఈ యేడాది 10 నుండి 20 శాతం ధరలు పెరిగాయి. నిర్వాహకు లకు, ఉత్సవ కమిటీలకు పెరిగిన ధరలు భారంగా పరిణమించా యి. కొన్ని సంఘాలు హైద్రాబాద్ నుండి పెద్ద విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి



ఉత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో జరుపుకో వాలి. గణేష్ ఉత్సవాలు, బక్రీద్ పండుగల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగ కుండా పోలీసుశాఖ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేస్తున్నాం. బలవంతంగా చందాలు వసూ లు చేస్తే చర్యలు తప్పవు. మండపాలకు విద్యుత్ సరఫరాకు విద్యుత్‌శాఖ నుండి అనుమతి పొందాలి.
- రామలింగారెడ్డి, ఎస్ఐ, ఆమనగల్లు

మట్టి గణపయ్యలనే ప్రతిష్ఠించాలి



పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలంతా మట్టి గణప య్యలనే ప్రతిష్ఠించి పూజించాలి. మట్టిగణపతే మహాగణపతి. పర్యావరణాన్ని పరిరక్షిం చినవార మవుతాం. మట్టి గణపయ్యలు నీటిలో కూడా తొందరగా కరిగి నీరు కలుషితం కాకుండా ఉంటుంది. ప్రతియేటా మట్టి గణపయ్యలను ఉచితంగా చిన్న ప్రతిమలను అందిస్తున్నాం.
- రాము, జేఏసీ మండల నాయకుడు

విధిగా అనుమతి తీసుకోవాలి



మండపాలకు ఉత్సవకమిటీలు విద్యుత్ కనెక్షన్‌కు విధిగా అనుమతి పొందాలి. వాల్ట్ ప్రకారం 0 నుండి 250 వరకు రూ. 500, 250 నుండి 500 వరకు రూ.1000, 500లకు పైగా రూ. 1500లతో పాటు ఆపై వాడే ప్రతి 500 వాల్ట్‌కు రూ.750 చొప్పున డి.డిలు చెల్లిస్తే తామే మండపాలకు కనెక్షన్‌లు ఇవ్వడం జరుగుతుంది. అక్రమ విద్యుత్ వినియోగిస్తే చర్యలు తప్పవు
- రమేశ్‌గౌడ్, విద్యుత్‌శాఖ ఏఈ

85 మందికి కంటి వైద్య పరీక్షలు



ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కండె సత్యనారాయణ శిబిరాన్ని ప్రాంభించారు. కంటి వైద్య సహాయకుడు వీరమల్ల వెంకటస్వామి ఆధ్వర్యంలో శిబిరంలో 85 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 30 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి ఐఓఎల్ ఆపరేషన్ల నిమిత్తం రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తలరించారు. లయన్స్‌క్లబ్ జిల్లా విద్యాకమిటీ చైర్మన్ రాంరెడ్డి, పిఆర్‌ఓ ఎమ్.డి.పాషా, సభ్యులు కొండల్‌రెడ్డి, రాంరెడ్డి, డాక్టర్ అనుపమ సిబ్బంది వేణు, శేఖర్ పాల్గొన్నారు. - (ఆమనగల్లు)

ఆలయ భూములను కాపాడాలని తహసీల్దార్‌కు వినతి



శివాలయ భూములను కబ్జాదా రుల నుంచి కాపాడాలని మండల శివాలయ కమిటీ సభ్యులు, పట్టణ పద్మశాలి సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆమనగల్లు శివాలయానికి సర్వే నెం : 869, 934, 1474 లలో భూములు అన్యాక్రాంతం జరిగాయయని ,రెవెన్యూ రికార్డులలో లేకుండాచేసి వేరే వారు సాగుచేసుకుంటున్నారని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. చెరుకు శివకుమార్, గుజ్జరి పెద్దయ్య, అవ్వారి శివలింగం, గాజుల శ్రీనివాసులు, ఏలె యాదగిరి పాల్గొన్నారు. - (ఆమనగల్లు)

మృతుల కుటుంబాలకు నాయకుల పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ జగన్నాథం

ఆమనగల్లు : ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామానికి చెందిన రైతు డేరంగుల జంగయ్య (55) సోమవారం తెల్లవారు జామున గుండె పోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య బక్కమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. మాజీ ఎంపి మంద జగన్నాథ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ లు మృతి చెందిన రైతు జంగయ్య సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించించారు. పరామర్శించిన వారిలో సింగంపల్లి ఎంపిటిసి గుంపెని శ్రీనివాస్, సర్పంచ్ కల్లు రమరణారెడ్డి, వడ్డెర సంఘం జిల్లా నాయకుడు డేరంగుల వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మాడ్గుల : మాడ్గుల మండలంలోని నాగిళ్ల గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సురమళ్ల సత్తయ్య భార్య కౌసల్య (50) కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధ పడుతూ ఆదివారం నాగిళ్ల గ్రామంలో మృతి చెందింది. వారి కుటుంబాన్ని నాగకర్నూల్ మాజీ ఎంపి మంద జగన్నాథ్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డిలు పరా మర్శించి సత్తయ్యను ఓదార్చారు. పరామర్శించిన వారి లో ఎంపీపీ జైపాల్ నాయక్, జడ్పీటీసీ పగడాల రవి, టీఆర్ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, జంగయ్య, రాములు, రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రామకృష్ణ

కడ్తాల్ : ఎన్ఎస్‌సెల్ ఆమనగల్లు కాంగ్రెస్ అధ్యక్షుడిగా కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామానికి చెందిన కంబాల రామకృష్ణ నియమితులయ్యారు. సోమవారం మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నిక ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడుకి కల్వకుర్తి ఎమ్మెల్యే చల్లా వంశీచంద్ రెడ్డి ,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి జగన్ లు నియామకపత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, బీక్యానాయక్, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిటిసిలు లక్ష్మయ్య, వెంకటేష్, మాదారం సర్పంచ్ నర్సింహ, నాయకులు లక్ష్మీనర్సింహ రెడ్డి, రాములు, రామచంద్రయ్య, లాయక్ అలీ, యాదయ్య గౌడ్, మల్లేశ్‌గౌడ్, బాల్‌రాజ్, కృష్ణనాయక్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు : నర్సింహా

తలకొండపల్లి : తలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడి విధులకు హాజరు కావాలని, హాజరు కాని వారిపై చర్యలు తీసుకో వాలని తలకొండపల్లి జడ్పీటీసీ సభ్యుడు నర్సింహ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మీజిల్స్, రుబెల్లా టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభానికి వైద్యులు రాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపించడంతో జడ్పిటిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లతో కలిసి నర్సింహ టీకాలు వేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సర్పంచ్ నిర్మల, ఉప సర్పంచ్ యాదయ్య, హెచ్.ఎమ్.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం : జగన్నాథం



పరామర్శిస్తున్న జగన్నాథం, జైపాల్‌యాదవ్

ఆమనగల్లు : గ్యాస్ సిలిండర్‌పేలి, ఇల్లు దగ్దమై సర్వం కోల్పోయిన శాంతినగర్‌కాలనీకి చెందిన పొలిశెట్టి లక్ష్మయ్య కుటుంబాన్ని సోమవారం నాగర్‌కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మంద జగన్నాథ్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ లు పరామర్శించారు. దగ్గవారి వెంట నాయకులు ఆలయ్య గౌడ్, అప్పం శ్రీను, ఎంగళి బాలకిష్టయ్య ఉన్నారు.

విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలి : హరిప్రసాద్

ఆమనగల్లు: సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచనం దినాన్ని అధికారికంగా నిర్వహించా లని బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఆమనగల్లు జడ్పిటిసి సభ్యుడు కండె హరిప్రసాద్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట బిజెపి ఆధ్వర్యంలో నిరసన నిర్వహించి తహసీల్దార్ రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు.

తలకొండలపల్లి : విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని మండల బిజెపి అధ్యక్షుడు బక్కికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ ఆర్.పి.జ్యోతికి మండల నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రూ.60 లక్షలతో ఎల్ఈడీ దీపాలు

కడ్తాల్ : కల్వకుర్తి చల్లా వంశీచంద్ రెడ్డికృషి తో కడ్తాల, తలకొండపల్లి, ఆమనగల్లు బ్లాక్ పరిధిలోని ఆయా గ్రామాలకు ఎంపి నంది ఎల్లయ్య సహకారంతో ఎంపి నిధుల నుండి రూ.60 లక్షల రుపాయల ఎల్ఈడి వీధి దీపాలు మంజూరు అయ్యాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షు డు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం బీక్యానాయక్‌తో కలిసి శ్రీనివాస్ గౌడ్ సమావేశం లో మాట్లాడుతూ ఎమ్మెల్యే వినతి మేరకు ఎల్ఈడి దీపాలు మంజూరు అయ్యాయన్నారు.

ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని వినతి



రావిచేడ్ పంచాయతీ పరిధి లో ఉన్న న్యామతాపూర్ గ్రామా న్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పా టు చేయాలని కోరుతూ సోమవా రం గ్రామ నాయకులు కడ్తాలలో తహసీల్దార్ రవికు మార్‌కు వినతిపత్రం అందజే శారు. తమ గ్రామంలో 800 పైగా ఓటర్లు ఉన్నారని ఇప్పటికే తమ గ్రామం లో అభివృద్ధిలో వెనకబడిం దన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు కృష్ణంరాజు, నరేశ్,మహేశ్, మణికంఠ, శ్రీశైలంతదితరులు ఉన్నారు. - (కడ్తాల్)

'తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

మంచాల : గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పరమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంఘం నాయకులతో కలిసి ఆరుట్లలో మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎన్నో రకాల పనిచేస్తున్నా కేవలం 3 గం.ల వేతనం చెల్లిస్తూ శ్రమదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి 7వ వేతన సంఘం సిఫారసులు అమలుచేస్తూ 8 గం.ల పనివిధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. లేదంటే తపాల ఉద్యోగుల సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు శ్రీనివాస్, వెంకటేష్, నర్సింహ, అర్జున్‌జీ, నన్నోజీ, నాగప్ప, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమించిన ప్రతి కార్యకర్తకూ ఆదరణ

విభేదాలు విస్మరించి పార్టీకోసం శ్రమించాలి

యాచారం మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు అచ్చనమల్లిఖార్జున్

యాచారం : పార్టీపటిష్టత కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకు ఆదరణ ఉంటుందని, ఎలాంటి కల్మషాలు లేకుండా పార్టీకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని యాచారం మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు అచ్చనమల్లిఖార్జున్ పార్టీ కార్యకర్తలను కోరారు. సోమవారం యాచారం మండల టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం మాల్‌లో జరిగింది. ఈసందర్భంగా మల్లిఖార్జున్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు ప్రజలకందునట్లు చూడాలన్నారు. పించన్లు, మరుగుదొడ్లు, రుణమాఫీ లాంటి అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. నెల వ్యవధిలో తక్కళ్లపల్లిలో డబుల్ బెడ్‌రూంల నిర్మాణం కోసం ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే



మాట్లాడుతున్న అచ్చన మల్లిఖార్జున్

చొరవ కారణంగానే ప్రతి గ్రామానికి ఇప్పటికీ కోటి రూపాయలకు మించి డబ్బును వివిధ పథకాలకు అందించినట్లు చెప్పారు. ఇక నుంచి ఎలాంటి అభివృద్ధి పనులకైనా గ్రామశాఖ అధ్యక్షకార్యదర్శులను సంప్రదించకుండా చిల్లి గవ్వ ఇచ్చేదిలేదని తేల్చి చెప్పారు. పార్టీలో ఎలాంటి కల్మషాలు లేకుండా ప్రతి ఒక్కరిని కలుపుకుని పోతున్నా నిందలేయడం తగదని యాచారం మండల జడ్పీటీసీ కె.రమేష్ అన్నారు. ఎమ్మెల్యే కనుసన్నల్లో పార్టీ కార్యకర్తలు నడుచుకోవాలన్నారు. వేరువేరు పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేరాం, ఇందులో కూడా విభేదాలకు పోయి పార్టీని రచ్చకీడ్చడం మంచి పద్ధతి కాదని యాచారం మండల సహకార సంఘ చైర్మన్ నాయినిసుదర్శన్ రెడ్డి పార్టీ శ్రేణులకు హితవు పలికారు. సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తలారిమల్లేష్, నాయకులు మారోజు శ్రీనివాస్‌చారి. సర్పంచులు వి. రాజునాయక్, బొక్కనారాయణ రెడ్డి, మల్లేష్, నర్సింహా, కందుకూరి రామచంద్రయ్య, ఎంపీటీసీలు మెతెశ్రీశైలం, అరవింద్‌నాయక్, శంకర్ నాయక్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటి డైరక్టర్లు ఓరుగంటి యాదయ్యగౌడ్, ఉడతల జంగయ్యగౌడ్, మచ్చలక్ష్మణ్, నాయకులు వెంకట్ రెడ్డి, శంకర్‌నాయక్, బందె రవికిరణ్ రెడ్డి, కె.నారాయణ రెడ్డి, అచ్చనబాష, వినోద్‌కుమార్, లిక్కి నర్సింహారెడ్డి, ఎ.పరీక్షన్ రెడ్డి, లిక్కిశ్రీనివాస్ రెడ్డి, చిన్నోళ్ల జహంగీర్, భాస్కర్ తదితరులున్నారు.



లింగంపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లల అభివృద్ధి, ఎదుగుదల ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

'పౌష్టికాహారం అందించాలి'

మంచాల : అంగన్‌వాడీల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందివ్వాలని లింగంపల్లి సర్పంచ్ రాచకొండ వాసవి చెప్పారు. సోమవారం ఉపసర్పంచ్ మహేందర్‌తో కలిసి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల అభివృద్ధి ఎదుగుదలకు సంబంధించిన ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీఆచర్ స్వరూప, గ్రామస్థులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు.. తొట్టెల ఊరేగింపు

మంచాల : మంచాల మండల పరిధి జాపాల, నోముల, అస్మత్‌పూర్ తదితర గ్రామాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అనంతరం సోమవారం తొట్టెల ఊరేగింపు ఉత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా డోలు, డప్పువాయిద్యాలు, కళాకారులు, పోతరాజుల ప్రదర్శన అలరించాయి.

10/10 జీపీఏ సాధనకు ప్రత్యేక క్లాస్‌లు

యాచారం ఎంఈవో పీ.ఎస్. వినోద్‌కుమార్



ప్ర: విద్యాప్రమాణాలు పెంచడానికి పెంచడం కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారు.

జ: పదోతరగతిలో 10/10 జీపీఏ సాధించడం కోసం ఇప్పటి నుంచే తరగతిలో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక క్లాస్‌లు తీసుకొని వారికి అర్థం కాని విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: ఉపాధ్యాయుల కొరత ఉందా, ఎంత మంది వలంటీర్లున్నారు. ఉపాధ్యాయుల కొరత తీర్చడం కోసం ఏంచర్యలు తీసుకుంటున్నారు.

జ: మండలంలో 37 మంది వలంటీర్లున్నారు. 53 మంది ఉపాధ్యాయులను భర్తీ చేయాల్సి ఉంది. త్వరలో ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించనుంది.

ప్ర: పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నా నీటి వసతి లేక నిరుపయోగంగా ఉన్నా వాటిని ఎందుకు పట్టించుకోవడం లేదు.

జ: స్కావెంజర్స్ నియామకం కోసం నెలకు 2500 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. మూత్రశాలలు, మరుగుదొడ్లకు నీరందించడం కోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులచేత , ఎస్ఎంసీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీల చేత సమావేశం ఏర్పాటు చేసి సమస్య తీర్చడం కోసం కృషి చేస్తున్నాం. నీటి వసతి లేనిచోట నీరందించడం కోసం చర్యలు తీసుకుంటున్నా.

ప్ర: మధ్యాహ్న భోజనం కోసం తరచూ బియ్యం కొరత వస్తుంది. అంతేగాకుండా నాసిరకం బియ్యం సరఫరా జరుగకుండా చర్యలు తీసుకుంటున్నారా?

జ: పలు చోట్ల బియ్యం కొరత వస్తున్న మాట వాస్తవమే. ఇక నుంచి బియ్యం కొరత రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. నాసిరకం బియ్యం వస్తే వాటిని తక్షణమే పౌరసరఫరాల శాఖకం దించి మేలురకం బియ్యం పంపిణీ కోసం చర్యలు తీసుకుంటున్నా.

ప్ర: పలు చోట్ల ఆటలసామాగ్రి లేక పోగా పీఈటీలు కూడా లేరు కదా?

జ: ఆటలసామాగ్రి లేని చోట వాటిని సరఫరా చేయడం కోసం కృషి చేస్తున్నా. నల్లవెల్లి, కుర్మిద్ద, కొత్తపల్లి పాఠశాలల్లో పీఈటీల పోస్టులను ప్రభుత్వం నియమించాల్సి ఉంది. ఇదే విషయమై సంబంధిత అధికారులకు వివరించాం. చింతపట్ల పాఠశాలనుంచి పలువురు బాలికలు అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో, వాలీబాల్ ఆటల్లో విజయం సాధించి పాఠశాలకు పేరు తెచ్చారు.

ప్ర: మండలంలో ఏఒక్క పాఠశాలలో కంప్యూటర్ బోధన జరగడం లేదు కదా. విద్యార్థులకు బోధించడం కోసం ఏం చేస్తున్నారు.

జ: ఇక నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ బోధన చేయించడం కోసం చర్యలు తీసుకుంటున్నాం. నందివనపర్తి, మాల్, మేడిపల్లి, యాచారం, చిన్నతూండ్లలో కంప్యూటర్లున్నాయి. బోధకుల నియామకానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ప్ర: హరితహారం విజయవంతం చేయడం కోసం ఏంచర్యలు తీసుకుంటున్నారు.

జ: ప్రతి పాఠశాలలో నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకొని కాపాడుతున్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో 5200 మొక్కలు ఈ ఏడాది నాటాం.

వాల్‌పోస్టర్ విడుదల



సీపీఎస్ రద్దు కోరుతూ యూటీఎఫ్ తలపెట్టిన ధర్నా వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మంచాల : కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీంను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కిషన్ చౌహాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దుకోరుతూ సెప్టెంబర్ 1న టీఎస్‌యూటీఎఫ్ తలపెట్టిన ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆరుట్లలో విడుదల చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అద్యక్ష,కార్యదర్శులు బుగ్గరాములు, శ్రీకాంత్, యాదయ్య, ఆంజనేయులు, యాదగిరి, బాబు, చారి, స్వాతి, మల్లేష్, సంజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందికి సన్మానం

మంచాల : ఉపాధిహామీ పథకంలో జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులు పొందిన ఆరుట్ల ఫీల్డుఅసిస్టెంట్ నర్సింహ, లోయపల్లి టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్‌కు సోమవారం మంచాల మండల పరిషత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయమ్మ, వైస్‌ఎంపీపీ దన్నెబాషయ్య, ఎంపీడీవో నాగమణి అవార్డు గ్రహీతలకు శాలువాను కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పీవో వీరాంజనేయులు, క్షేత్రసహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం

సర్వశిక్షా అభియాన్ జేఏసీ అధ్యక్షుడిగా సంపత్

ఇబ్రహీంపట్నం: సర్వశిక్షా అభియాన్ ఇబ్రహీంపట్నం మండల జేఏసీని నూతనంగా ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా జె.సంపత్, ప్రధాన కార్యదర్శిగా కట్టెల రవి, ఉపాధ్యక్షుడిగా సైదమ్మ, కార్యవర్గ సభ్యులుగా బి.శేషగిరి, సిగ రఘురంజన్‌గౌడ్, ఎం.అశోక్, అమీనాబేగం, బి.బుచ్చప్ప, బి.అలివేలును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ సుప్రీం కోర్టుతీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేయాలని నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నా సమస్యకు పరిష్కారం లేదని అన్నారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పీఏబీ ప్రకారం వేతనాలు చెల్లించాలని అన్నారు. మహిళా ఉద్యోగులకు ఆరు నెలల ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మాదిరిగా జీతాలు పెంచాలని అన్నారు.



డిమాండ్లతో కూడినపత్రాన్ని చూపుతున్న జేఏసీ సభ్యులు

నేడు గొర్రెల పంపిణీ

యాచారం : యాచారం మండలం కొత్తపల్లి గ్రామంలో మంగళవారం గొర్లకాపరులకు గొర్ల పంపిణీ ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శంకర్ ఒక ప్రకటనలో చెప్పారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల కాపరులు, అధికారులు పాల్గొనాలని ఆయన చెప్పారు.

నేడు గణేష్ ఉత్సవ కమిటీ సమావేశం

యాచారం : గణేష్ ఉత్సవ కమిటి సమావేశం మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు శివశరణ్ గార్డెన్‌లో ఉంటుందని యాచారం సీఐ కె.చంద్రకుమార్ చెప్పారు.మండలంలోని వివిధ గ్రామాల గణేష్ ఉత్సవ సమితి సభ్యులు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.

వినాయక మంటపాల ప్రతిష్టపై ప్రధానంగా చర్చ ఉంటుందని ఆయన చెప్పారు. ప్రభుత్వం నిబంధనల మేరకు వినాయక మంటపం ఏర్పాటు చేసుకోవాలన్నారు.

మత్స్యశాఖలో కదలిక

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
- నీళ్లున్న చెరువుల్లోకి చేప పిల్లలు
- సెప్టెంబర్ మొదటి వారంలో చేపలను వదులుతాం
- టెండర్ ప్రక్రియ పూర్తయింది.
- హోల్‌సేల్ మార్కెట్‌గా శేరిగూడ చేపల పెంపక కేంద్రం
- జిల్లా మత్స్యశాఖ అధికారి రాజారాం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : నీలి విప్లవానికి వరుణ గండం' శీర్షికపై మత్స్యశాఖ అధికారులు స్పందించారు. సెప్టెంబర్ మొదటి వారంలో చెరువుల్లో చేపలను వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి వెల్లడించారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. చెరువుల జాబితా తయారు చేస్తున్నాం. చెరువుల్లో 1/3 శాతం నీరున్న చెరువులను గుర్తిస్తున్నాం. జిల్లాలోని కేశంపేట, ఫరూక్‌నగర్, కొందుర్గు, శంషాబాద్, షాబాద్‌లోని పహిల్వాన్ చెరువుతో పాటు అబ్దుల్లాపూర్ చెరువులో నీరు చేరింది. చేపల పెంపకంపై త్వరలో జిల్లాలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. 50 చెరువుల్లో 144.99 లక్షల 34-40 ఎంఎం సైజు గల చేపలను వదిలేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే అనాజ్‌పూర్ చెరువులో 1.76 లక్షల చేపలను (82-100 ఎంఎం సైజు) వదిలేందుకు సిద్ధంగా ఉన్నాం. 35-40 ఎంఎం చేపకు 58 పైసలు, 82-100 ఎంఎం సైజుగల చేపకు 1.29 పైసలు ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. ఇతర జిల్లాల నుంచి చేప విత్తనాలను తెప్పిస్తున్నాం. సీడ్ సిద్ధంగా ఉంది. శేరిగూడలో చేపల పెంపక కేంద్రాన్ని వచ్చే ఏడాది హోల్‌సేల్ మార్కెట్‌గా మార్చనున్నాం. మత్స్యశాఖలో సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు నెలకొంటున్నాయి. ప్రభుత్వం సిబ్బందిని నియమిస్తే బాగుంటుంది.

మరుగున పడిన మరుగుదొడ్లు

- బిల్లులు చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం
- లబ్ధిదారుల ఆందోళన
- స్వచ్ఛభారత్ అభాసు పాలు
- గతేడాది 15,724 మంజూరు
- ఇప్పటి వరకు పూర్తయినవి 3022 మాత్రమే..

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించేందుకు ప్రభుత్వం చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులు జిల్లాలో నత్తనడక సాగుతున్నాయి. స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామాల్లో వందశాతం మరుగుదొడ్ల నిర్మించేందుకు కేంద్రం భారీగా నిధులు ఖర్చు చేస్తున్న విషయం తెలిసిందే. దశల వారీగా గ్రా మాలను ఎంపిక చేసి అన్ని గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ రూపొం దించింది. ఇందుకు అవసరమైన నిధులను ఉపాధి హామీ పథకం, గ్రామీణ నీటిసరఫరా విభాగాల ద్వారా సమకూరుస్తోంది. ఒక్కో వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించేందుకు లబ్ధిదారునికి ప్రభుత్వం రూ. 12వేల రూపాయిలు అందచేస్తుంది. ఆరంభంలో దీనికి మంచి స్పందన వచ్చింది. లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారు. కానీ తరువాత పర్యవేక్షణలోపంతో ఈ కార్యక్రమం ముందుకు సాగడం లేదు. మరుగుదొడ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన డబ్బులుకూడా సకాలంలో అందడం లేదు. దీంతో అనేక మండలాల్లో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. లబ్ధిదారులకు బిల్లులు చెల్లించ పోవడంపై రెండు రోజుల కిందట జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో కూడా చర్చ జరిగింది. అధికారుల తీరుపై ఎమ్మెల్యే యాదయ్యతో పాటు మరికొందరు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అధికారులు బిల్లులు చెల్లించకుంటే ఆశించిన లక్ష్యాలు సకాలంలో సాధించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు తక్షణమే బిల్లులు చెల్లించాలని కోరారు. ఇదిలా ఉంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 668 గ్రామ పంచాయతీలలో 3,13,129 గృహాలు ఉండగా వీటిలో 1,32,129 గృహాలకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయి. గడిచిన ఏడాది ప్రతి మండలంలోని అయిదు గ్రామాలను ఎంపిక చేసి వాటిలో సంపూర్ణ మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రణాళికలు రూపొందించారు. ఉమ్మడి జిల్లాలో 140 గ్రామాల్లో సుమారు 17వేల మరుగుదొడ్లు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించారు. అయితే ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. 2016 లో చేపట్టిన ఈ పనులు ఇంత వరకు పూర్తికాలేదు. గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య విభాగం ద్వారా 2016-17లో ప్రస్తుత రంగారెడ్డి జిల్లాలో 15724 మరుగుదొడ్లు మంజూరు చేయగా ఇందులో ఇప్పటి వరకు కేవలం 3022 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. మరుగుదొడ్ల నిర్మాణ పనులు పర్యవేక్షించేందుకు కేంద్రం నిఘా కూడా ఏర్పాటు చేసింది. ఎప్పటికప్పుడు ఫోటోలో తీయించి వీటిని అప్‌లోడ్ చేయిస్తోంది. పనులు జరుగు తున్నా యా? అనేది తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానం కూడా వినియోగిస్తోంది. ఇందుకోసం ప్రతి మరుగు దొడ్డి నిర్మాణం జరిగే చోట జియో ట్యాగింగ్ ఏర్పాటు చేస్తోంది. నిర్మాణాలు పూర్తిచేసిన వారికి బిల్లులు చెల్లించేందుకు ఇది దోహదపడుతుంది. కానీ లబ్ధిదారులకు ఈ సాంకేతిక పరిజ్ఞానం కూడా అక్కరకు రావడం లేదు. మరుగుదొడ్లు నిర్మించుకున్న వారు బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది.



ప్రజావాణికి అధికారులు
తప్పనిసరిగా హాజరుకావాలి

- కలెక్టర్ రఘునందన్‌రావు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఎం. రఘునందన్‌రావు అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి పలు విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బహుదూరం నుంచి సమస్యలతో వస్తున్న వారి పట్ల సానుకూలంగా స్పందించాలని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను 30 రోజుల్లోగా పరిష్కరించేలా చూడాలని చెప్పారు. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, వర్షం కురియగానే మొక్కలను నాటాలని ఆయన సూచించారు. ప్రజావాణిలో జేసి సుందర్ అబ్నార్, సీపీ శర్మ, డీఆర్వో భవాని శంకర్, తదితరులు ఉన్నారు.

పెద్దవేడును జీపీగా మార్చాలని కలెక్టర్‌కు వినతి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): షాబాద్ మండలం పెద్దవేడు గ్రామాన్ని గ్రామ పంచాయతీగా మార్చాలని కోరుతూ గ్రామస్థులు జిల్లా కలెక్టర్ ఎం. రఘునందన్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. పెద్దవేడు గ్రామంతో పాటు పెద్దవేడు తాండాను కలుపుకుని సుమారు 700 వరకు జనాభా ఉందని తెలిపారు. అనుబంధ గ్రామంగా ఉండటం వల్ల తమ గ్రామంతో పాటు తాండ అభివృద్ధికి నోచుకోవటం లేదని గ్రామస్థులు శ్రీనివాస్‌గౌడ్, కిష్టయ్య, తులసిరెడ్డి, నారాయణరెడ్డి, యాదయ్య, మహేందర్, స్వామి తెలిపారు.

ఏడు నియోజక వర్గాలకు బీజేపీ కన్వీనర్ల నియామకం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు భారతీయ జనతాపార్టీ కన్వీనర్లను నియమించింది. రాం జేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా మొండ్రా కొమరయ్యను నియమించగా చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా బి. జంగారెడ్డిని నియమించారు. అలాగే షాద్‌నగర్ నియోజక వర్గ కన్వీనర్‌గా దేవల్లి అశోక్‌గౌడ్, శేరిలింగంపల్లి కన్వీనర్‌గా పోరెడ్డి, బుచ్చిరెడ్డి, ఎల్బీనగర్ కన్వీనర్‌గా వంగ మధుసూదన్‌రెడ్డి, మహేశ్వరం కన్వీనర్‌గా వీరన్న దీరజ్‌రెడ్డి, కల్వకుర్తి కన్వీనర్‌గా మట్ట వెంకటేష్‌గౌడ్‌ను నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తెలిపారు.

విద్యార్థి లోకం గర్జిస్తే
కేసీఆర్ సర్కార్ పతనం

- ఆమనగల్లులో టీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థి పోరుగర్జన సభ
- రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపాటు
- విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమం తప్పదు
- తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్



పోరు గర్జన సభలో పాల్గొన్న విద్యార్థి,విద్యార్థులు

ఆమనగల్లు: విద్యార్థి లోకం గర్జిస్తే కేసీఆర్ సర్కార్ పతనం తప్పదని తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ హెచ్చరించారు. వందలాది మంది విద్యార్థుల ఆత్మబలిదానాలు, సకల జనుల ఉద్యమపోరాట ఫలితంగా సిద్ధించిన స్వరాష్ట్ర ఫలాలను కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే అనుభవిస్తుందని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే తమ కష్టాలు తొలగు తాయని భావించిన ప్రజలకు కేసీఆర్ నియంత పోకడలు, ఏక పక్ష నిర్ణయాలతో మరిన్ని కష్టాలు తీవ్ర మయ్యాయని ఆయన విచారం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని , లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని పేర్కొన్న కేసీఆర్ ఊరికో ఉద్యోగం కూడ ఇవ్వలేదని సుధాకర్ఎద్దేవా చేశారు. నిరుద్యోగులు ఉద్యోగాలు లేక వేదనకు లోనవుతుంటే కేసీఆర్ తన ఇంట్లో నాలుగు ఉద్యోగాలు కల్పించుకున్నాడని ధ్వజమెత్తారు. ఆమనగల్లు పట్టణంలోని కళ్యాణి గార్డెన్‌లో సోమవారం తెలంగాణ విద్యార్థి యూనియన్ (టీఎస్‌యు) ఆధ్వర్యంలో విద్యార్థి పోరు గర్జన సభ నిర్వహించారు. సభకు తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోరు గర్జన సభకు కల్వకుర్తి, మాడ్గుల, తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్, వెల్దండ మండలాలను విద్యార్థుల పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈసందర్భంగా కళాకారుల ఆట, పాటలు అందరిని అలరించాయి. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులు బహుమ తులు ప్రదానం చేశారు.

● విద్యారంగ సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

అంనతరం టిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి కట్ట జంగయ్య అధ్యక్షతన జరిగిన విద్యార్థి పోరు గర్జన సభలో చెరుకు సుధాకర్ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పరిష్కారంలో రాష్ట్రం లోని టీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. తెలంగాణ సంపన్న రాష్ట్రంగా పేర్కొంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ మరీ విద్యార్థుల ఉపకార వేతన బకాయిలు ఎందు కు విడుదల చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. వ్యక్తిగత ప్రచారం, వివిధ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు కోట్లది రూపాయలు కేటాయిస్తున్న కేసీఆర్‌కు విద్యార్థుల ఫిజ్‌రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించడానికి చేతులు రావడం లేదా అని ప్రశ్నిం చారు. ప్రభుత్వ విధానాలు కార్పొరేట్, ప్రైవేట్ విద్యను ప్రోత్సాహించే విధంగా ఉన్నాయన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న నేపంతో రాష్ట్రంలో 3500 ప్రభుత్వ పాఠశాలలను మూసి వేసేందుకు యత్నిస్తుందని అదే జరిగితే తిరుగుబాటు పోరాటం తప్పదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో సరైన వసతు లులేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తద్వారా ఆయా సమస్యలు విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆయన మండిపడ్డారు. పోరు గర్జన సభలో తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌని నర్సింహాగౌడ్ మాట్లాడుతూ మాటలతోనే కాలయాపన చేస్తున్నారు తప్ప ప్రజలకు మూడేళ్లలో ఒరిగిందేమి లేదన్నారు. కేసీఆర్ సర్కార్‌పై ప్రజల భ్రమలు తొలగాయని ఆ ప్రభుత్వం ఇక ఎంతో కాలం ఉండదన్నారు. ఆమనగల్లు పట్టణంలో విద్యారంగ సమస్యల పరిష్కారం తెలంగాణ ఇంటి పార్టీ విద్యార్థుల పక్షాన పోరాట కార్యాచరణ చేపడు తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎ స్‌యు రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ మాదిగ, వ్యవస్థాపక అధ్యక్షుడు సందీప్‌చమర్, జేఏసీ మండల నాయకులు పాపిశెట్టి రాము, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఇమ్మానియేల్, జేఏసీ రాజు, ఎమ్ఎస్ఎఫ్ గోపి, టిఎస్ ఎస్ఎఫ్ దినేష్, టిఎస్‌యు తాలుకా ఇన్‌చార్జి కె.వెంకటేష్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

మహేశ్వరం - శంషాబాద్

8

రంగారెడ్డి, మంగళవారం 22 ఆగస్టు 2017

పిల్లలకు టీకాలు వేయించాలి : స్వప్ననవీన్

మహేశ్వరం : చిన్నపిల్లలకు తట్టు, రూబెల్లా టీకాలు వేయించాలని వైస్ ఎంపీపీ మునగపాటి స్వప్ననవీన్ అన్నారు. సోమవారం మహేశ్వరంలో గల ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ ఎస్.ఆనందం ఆధ్వర్యంలో తట్టు, రూబెల్లా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 ఏళ్ల వరకు తట్టు, రుబెల్లా టీకాలు వేయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ సెంటర్లలోనూ టీకాలు వేయడం అభినందనీయమన్నారు. తట్టు, రుబెల్లా వ్యాధులు వైరస్‌వల్ల ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశాలున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పరీక్షిత్‌పరేందర్, మండల విద్యాధికారి కృష్ణ, ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి, శ్రీశివగంగ రాజరాజేశ్వరాలయ కమిటీ మాజీ చైర్మన్ మునగపాటి నవీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై ప్రభాకర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎస్సై ప్రభాకర్

కందుకూరు : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సై ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల పరధిలోని కొత్తగూడ గ్రామంలో మహిళ డెవలప్‌మెంట్ సోషల్ వర్క్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కుట్టుమిషన్ నేర్చుకోవాలన్నారు. కొత్తగూడ సర్పంచ్ ఆర్.యాదయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ మండల్ డెవలప్‌మెంట్ ద్వారా మూడు నెలలపాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడంతో పాటు ధృవీకరణ పత్రాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సిహెచ్. సునీత, ఉప సర్పంచ్ కుమ్మరి లక్ష్మయ్య, వార్డు సభ్యులు సామ ప్రకాశ్‌రెడ్డి, సౌడపు అశ్విని, ప్రవళిక, మమత, పద్మ, ఎస్‌జీవో డైరక్టర్ ఎస్.వి.తిరుమలరావు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వెండికొండ సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

శంషాబాద్ : శ్రీ వెండికొండ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జాతర సోమవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో లక్షా యాభై వేల మంది భక్తులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బోలోశంకర్ మహారాజ్‌కీ జై, హరహర మహదేవ భజన గీతాలతో దేవాలయం మారుమ్రోగింది. దేవాలయంలో తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా దేవాలయం ఆవరణలో పెద్దఎత్తున రంగుల రాట్నాలు ఆటపాటలకు సంబంధించి దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆర్టీసీ సంస్థ జంట నగరాల నుంచి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసింది. శ్రావణ మాసం చివరి సోమవారం కావడంతో భక్తుల తాకిడి మరింత పెరిగింది. ఆదివారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండగగా జరిగింది. అనంతరం భక్తులు భజన చేస్తూ జాగరణ చేసి తెల్లవారు జామున అగ్ని గుండాల పూజలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్, వైస్ ఎంపీపీ సురేష్‌గౌడ్‌లో పాటు ఆర్టీసీ రాజేంద్రనగర్ డిపోకు చెందిన మేనేజర్ వెంకట్‌రెడ్డి డిపో మేజర్ శివకుమార్, కృష్ణ, ఎన్ఎన్‌రావుతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు సహకరించిన ఆర్టీసీ, విద్యుత్, గ్రామ పంచాయతీ అధికారులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపయ్యగౌడ్



మహేశ్వరంలో గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కిసాన్‌మోర్చా నాయకులు

మహేశ్వరం : రైతు సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పాపయ్యగౌడ్ అన్నారు. సోమవారం మహేశ్వరంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా సమావేశం జరిగింది, సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ నెల 28న మహేశ్వరం మండలం తుక్కుగూడలోని సత్యనారాయణ గార్డెన్‌లో జరగనున్న 'రైతు పంచాయతీ' కార్యక్రమానికి రైతులు పెద్దఎత్తున తరలి వచ్చేలా చూడాలని కిసాన్ మోర్చా నాయకులను ఆయన కోరారు. రాష్ట్రంలో రైతులు అడుగడుగునా దగా పడుతున్నప్పటికీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోవడం లేదని విమర్శించారు.

అనంతరం రైతు పంచాయతీకి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మాధవాచారి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తెల్గమల్ల యాదీష్, కె.వెంకటేష్, జి.రాములు, పార్టీ మండలాధ్యక్షుడు పోతర్ల సుదర్శన్‌యాదవ్, యాదయ్య, రాజేష్, భూపాల్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం : గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నమెంటులో మహేశ్వ రం మండలం తుక్కుగూడకు చెందిన ఏకలవ్య టీం విజయం సాధించింది. విజయం సాధించిన క్రీడాకారులు సోమవారం ఎమ్మెల్యే తీగలను కలవగా రూ. 10 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అనంతరం తీగల మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామీణ క్రీడాకారులకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఖోఖో కోచ్‌లు శ్రీనివాస్‌రావు, రామకృష్ణ, భవానివెంకట్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

శంషాబాద్‌లో తపాలా ఉద్యోగులు వంటావార్పు

శంషాబాద్ : మండల కేంద్రంలోని పోస్టాఫీసు ఎదుట గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం సభ్యులు సోమవారం వంటావార్పు కార్యక్రమం చేపట్టి ఆందోళన చేశారు. సంఘం చేస్తున్న సమ్మె ఆరోరోజుకు చేరుకుంది. ఆందోళనకు ఆల్ ఇండియా గ్రామీణ డాక్‌సేవక్ యూనియన్ తెలంగాణ సర్కిల్ సౌత్‌ఈస్ట్ డివిజన్ ప్రసిడెంట్ అంజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐడీజీ ఎస్‌యూ సూచించిన సవరణలతో సహా జీడీఎస్ కమిటీ రిపోర్టు అమలు చేయాలన్నారు. జీడీఎస్‌లకు 8 గంటలు పనికల్పించి సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ క్యాట్ ఫిన్సిపాల్ బెంచ్, మద్రాస్ క్యాట్ బెంచ్ తీర్పు ప్రకారం జీడీఎస్‌లకు పెన్షన్ మంజూరు చేయాలన్నారు. టార్గెట్‌ల పేరుతో జీడీఎస్‌లను వేధించడం ఆపివేయాలని చెప్పారు. అంతకు ముందు తపాలా కార్యాలయం ఎదుట వంటావార్పు చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళనకు స్థానిక బీజేపీ నాయకుడు కిషోర్ సంఘాభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు మోహన్‌శర్మతో పాటు పలు గ్రామాలకు చెందిన తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.



శంషాబాద్‌లో ఆందోళన చేస్తున్న తపాలా ఉద్యోగులు



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మండల కేంద్రంలో

మౌలిక వసతులు కల్పించాలని వినతి

కందుకూరు : మండల కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు ఊటు మహేందర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం నుంచి ప్రతి నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు వివిధ గ్రామాలకు, నగరానికి వెళుతుంటారనీ, వారి కోసం బస్‌స్టాండ్, మరుగుదొడ్లను ఏ ర్పాటు చేయాలన్నారు. అలాగే జాతీయ రహదారిపై ట్రాఫిక్ సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

గుర్తింపు లేని పాఠశాలలు మూసివేయాలి...

కాగా, రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు లేని విద్యాసంస్థలను మూసివేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గూడూరు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుమతి లేని ప్రైవేటు విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తున్నప్పటికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై మండల విద్యాధికారి వద్దుల వేణుగోపాల్‌రెడ్డికి పలుమార్లు వినతిఎత్రం ఇచ్చినా స్పందించడం లేదన్నారు. వీటితో పాలు మరో నాలుగు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో అనురాధ తెలిపారు. వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.క్రిష్ణకుమార్, పీఆర్ ఏఈ అనీల్‌కుమార్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను కబ్జాచేశారంటూ వినతి



స్థలాన్ని కాపాడాలంటూ వినతిపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్

కందుకూరు : గ్రామ శివారులో ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారంటూ గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం కందుకూరు గ్రామ ఉప సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కందుకూరు రెవెన్యూ పరిధిలోని 1015 సర్వేనెంబర్‌లో 1 ఎకరం 8 గుంటల ప్రభుత్వ భూమిలో కొన్ని సంవత్సరాలుగా శ్మశానవాటికను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. కాగా ఆ భూమి తూర్పు భాగాన నక్షబాట సైతం ఉన్నప్పటికీ కొందరు రియల్ ఎస్టెట్ వ్యాపారులు కబ్జాచేసి ప్లాట్లుగా మారుస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు సర్వేచేసి శ్మశానవాటికస్థలాన్ని చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సత్తయ్య, బీజేపీ నాయకులు అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండ్ర సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం పరిహారాన్ని చెల్లించాలి : తహసీల్దార్‌కు రైతుల వినతి

కేశంపేట: 2014 ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులలో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోయాయి. అప్పట్లో చెల్లించిన పంటనష్టం బీమా డబ్బులు ఇప్పించాలంటూ సోమవారం కేశంపేట తహసీల్దార్ లావణ్యకు వివిధ గ్రామాల రైతులు వినతిపత్రం అందజేశారు. బ్యాంకు నుంచి లోను పొందని దాదాపు 5,500 మందికి పైగా రైతులు బీమా చెల్లించారని తెలిపారు. ఆ సీజన్‌లో పూర్తిగా పంటలకు నష్టం జరిగినందున బీమా కంపెనీ పరిహారాన్ని చెల్లించిందన్నారు. అందులో 2840 మందికి మాత్రమే బీమా డబ్బులు వచ్చాయని, మిగతా రైతులకు బీమా డబ్బులు ఎందుకు రాలేదో విచారణ చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నర్సింహ్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, లింగారెడ్డి, గోపాల్ ఉన్నారు.

భూదాన్ భూములపై విచారణ జరిపించాలి

● జేసీ సుందర్ అబ్నార్‌కు రైతుల వినతి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

నందిగామ: నందిగామ శివారులో పాత సర్వే నెం.990లో గల వంద ఎకరాల పేదల భూములు అన్యాక్రాంతమయ్యాయని రైతులు సోమవారం జాయింట్ కలెక్టర్ సుందర్ అబ్నార్‌కు వినతిపత్రం అందించారు. 975లో ఈ భూమిని ప్రభుత్వం 24 మంది లబ్ధిదారులకు కేటాయించిందని పేర్కొన్నారు.ఇప్పటి వరకు వారికి పట్టా బుక్కులు ఇవ్వలేదని కొంతమంది భూస్వాములు పై భూమిని అన్యాక్రాంతం చేసి పొలాలను వెళ్లనివ్వకుండా తమను అడ్డుకుంటున్నారని, తగిన విచారణ చేసి తమకు న్యాయం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో న్యాయవాదులు సంగమేశ్వర్, అంజయ్యయాదవ్, రైతులు అంజయ్య, కావలి శ్రీను, జంగయ్య, పూర్ణ అరుణ్, శివగళ్ల పోచయ్య తదితరులున్నారు.

రైతాంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

● బీజేపీ కిసాన్‌మోర్చ జాతీయ నేత బోజిరెడ్డి



గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్ టౌన్: టీఆర్ఎస్ ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నదని బీజేపీ కిసాన్‌మోర్చ జాతీయ నాయకుడు బోజిరెడ్డి విమర్శించారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఫసల్ బీమా పథకాన్ని తీసుకువస్తే సీఎం కేసీఆర్ దాన్ని పూర్తిస్థాయిలో అమలు పరచకపోవడం శోచనీయమని అన్నారు. బీజేపీ నేత శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి తగిన న్యాయం చేయాలని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, మోటె శ్రీను, వెంకటేష్‌గుప్త, అశోక్‌గౌడ్, రాములు, రాంరెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

'సీపీఎస్‌ను తక్షణమే రద్దుచేయాలి'

కొందుర్గు: ఉద్యోగులకు నూతనంగా అమలు చేస్తున్న కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని టీసీపీఎస్ కొందుర్గు మండల అధ్యక్షుడు పండరినాథ్ కోరారు. వచ్చేనెల సెప్టెంబర్ 1న సామూహిక సెలవు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో యాదయ్యకు ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు యాదయ్య, నర్సింలు, మల్లేష్, రవి, కృష్ణ, తేజశ్విని, అనూష, కుమార్, రవీందర్‌జీ, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్

షాద్‌నగర్ అర్బన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికై కన్స్యూమర్ గ్రీవెన్స్ సమావేశం మంగళవారం ఉదయం 10 నుంచి 1.30 వరకు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ రాజారాంరెడ్డి తెలిపారు. సమావేశంలో సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్ అధికారులు పాల్గొంటారని వివరించారు. వినియోగదారుల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. బిల్లుల హెచ్చుతగ్గుల విషయంపై కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

రేపు గూడూరుకు మంత్రుల రాక

కొత్తూరు: గూడూరు గ్రామానికి నేడు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మంత్రులు పి.మహేందర్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు రానున్నట్లు సర్పంచ్ రాందాస్‌నాయక్, టీఆర్ఎస్ నాయకుడు సదానందం తెలిపారు. బీఆర్‌జీఎఫ్ పథకం కింద రూజ19లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

ఒకే టీకాతో రెండు వ్యాధుల నివారణ

షాద్‌నగర్ అర్బన్: ఒకే టీకాతో రెండు వ్యాధులను నివారించవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి సుమంత్‌కుమార్ పేర్కొన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ చటాన్‌పల్లి శివారులోని రాంనగర్ పాఠశాలలో సోమవారం తట్టు, రుబెల్లా టీకా కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులకు టీకా వేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని చిన్నారులకు సద్వినియోగం చేసేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సురేష్‌సింగ్, కౌన్సిలర్లు రాజేందర్‌రెడ్డి, మణమ్మ, జంగయ్య, శంకర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, బుచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఏఎన్ఎంలు నిర్మల, అమృత తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేశంపేట తహసీల్దార్ లావణ్య రాష్ట్ర ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను సోమవారం ఎన్.మురళీధర్‌రెడ్డి నేతృత్వంలో మండల టీఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ లావణ్యను ఘనంగా సన్మానించారు. - కేశంపేట

'సకల దేవతల స్వరూపం గోమాత'



అన్నదానం చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

షాద్‌నగర్ టౌన్: సకల దేవతల స్వరూపం గోమాత అని, గోమాతను పూజిస్తే ఎంతో పుణ్యం దక్కుతుందని విశ్వహిందూపరిషత్ నాయకులు పేర్కొన్నారు. అమావాస్యను పురస్కరించుకుని పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలోని శ్రీకృష్ణ గోశాలలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణానికి చెందిన బి.శ్రీనివాస్, అనురాధ, శ్రీకాంత్, సంధ్యారాణి, శ్రీధర్, లలితల ఆర్థిక సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు డిస్కో శ్రీను, ఆలయ ఈవో నరెందర్, సోలీపూర్ మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, మఠం శశిధర్, భద్రప్ప తదితరులున్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో..

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ గోశాలలో గోమాతలకు సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవులను పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించినట్లేనని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నందకిశోర్, రజిత, మాధురి, శ్రీనివాస్, పాండు, సంగీత, నీలరవి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

'జాగృతి సేవలను విస్తరించాలి'

షాద్‌నగర్ టౌన్: జాగృతి చేస్తున్న సేవలను గ్రామాల్లో విస్తరించాలని తెలంగాణ జాగృతి తాలూకా అధ్యక్షుడు సత్యనారాయణయాదవ్ కోరారు. జాగృతి ఫరూఖ్‌నగర్ మండల నూతన కమిటీని పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ మండల కన్వీనర్‌గా బి.బాలరాజు, కో-కన్వీనర్‌గా బాల్‌రామ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామకపత్రాలు అంగజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి గ్రామీణులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్రామిరెడ్డి, సురేష్ కుమార్, మన్నె నారాయణ, సునిల్‌రెడ్డి, రమేషయాదవ్, బాల్‌రాజ్, హన్మంత్‌రెడ్డి, జంగయ్య, యాదయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మధుసూదన్

కొందుర్గు: వినాయకచవితి, బక్రీద్ పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని షాద్‌నగర్ రూరల్ సీఐ మధుసూదన్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో వినాయకచవితి, బక్రీద్ ఉత్సవ కమిటీలతో పాటు అన్ని పార్టీల నాయకులతో శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా మండపాల ఏర్పాటు కోసం అనుమతులు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద రాత్రి వేళల్లో నిర్వాహకులు అందుబాటులో ఉండాలని, రాత్రి 10 తర్వాత మైక్ సెట్లను బంద్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, గోవర్ధన్‌గౌడ్, బల్వంత్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాంచంద్రయ్య, నర్సింహ్మారెడ్డి, యూసూఫ్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పండ్లతోటల రైతులకు శిక్షణా శిబిరం

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామ శివారులో ఉన్న భాస్కర్‌రెడ్డి తోటలో మంగళవారం పండ్ల తోటల రైతులకు శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి ఉషారాణి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే శిక్షణా శిబిరానికి రాష్ట్ర ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి బాబునాయక్, ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సువర్ణ, సైంటిస్ట్ కృష్ణలు హాజరవుతారని తెలిపారు. రైతులకు మామిడితోటలపై సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు.

చెత్తరిక్షాలు పంపిణీకి సిద్ధం

కొందుర్గు: స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా కొందుర్గు, జిల్లేడ్-చౌదరిగూడ మండలాల్లోని 29 గ్రామ పంచాయతీల్లో చెత్తను సేకరించేందుకు గాను చెత్త రిక్షాలను అందజే యనున్నారు. జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చేతుల మీదుగా త్వరలోనే చెత్త రిక్షాలను అందజేస్తామని అధికారులు తెలిపారు.

శ్రావణమాసం ముగింపు వేడుకలు

కొందుర్గు: మండల కేంద్రంలోని ఉమామహేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం శ్రావణమాసం ముగింపు సందర్భంగా పాశుపతాస్త్ర రుద్రహోమాన్ని నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ.. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్యగౌడ్, గండేటి వేణుగోపాల్, ఎస్.యాదగిరి, చేవెళ్ల కృష్ణయ్య, నర్సింలు, కొమరబండ శ్రీశైలం, రాజేశ్వరస్వామి పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

షాద్‌నగర్ టౌన్: విజేత జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు పవన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షునిగా గణేష్, ఉపాధ్యక్షునిగా మహేష్‌ను ఎన్నుకున్నారు.



మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదురుగా, ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం పొంచివుందని మండల వాసులు ఆందోళన చెందుతున్నారు. ఎలాంటి ప్రమాదం సంభవించక ముందే ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాలని మండలవాసులు కోరుతున్నారు. - కొందుర్గు

అఫిడవిట్ అందజేస్తేనే అనుమతి

- నిర్మాణాల్లో తేడాలొస్తే చర్యలు తీసుకునేలా అంగీకారం
- మునిసిపాలిటీల్లో కొత్తగా 'కామన్ అండర్ టేకింగ్' విధానం
- నూతన విధానంతో అందరిలో గుబులు



వికారాబాద్ అర్బన్: మీరు మునిసిపల్ పరిధిలో కొత్త ఇల్లు లేదా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించే ఆలోచనలో ఉన్నారా...? ఎప్పటిలాగానే అనుమతి పొందడానికి ఒక రకం బిల్డింగ్ ప్లాన్, కట్టుకునేందుకు మరో ప్లాన్ గీయిస్తున్నారా...? ఆగండాగండి... ఎందుకంటే మీరు అలా చేయడం ఇక కుదరదు. ఎందుకంటే పురపాలక శాఖ ఓ కొత్త అస్త్రాన్ని తీసుకొచ్చింది. అదే కామన్ అండర్ టేకింగ్ అఫిడవిట్. అంటే మనం నిర్మించే ఇల్లు, కమర్షియల్ కాంప్లెక్స్ పురపాలక శాఖ నిబంధనల మేరకే నిర్మించకుంటామని, లేదంటే దానిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకునే అధికారం పురపాలక అధికారులకు కల్పిస్తూ రాత పూర్వకంగా రాసి ఇచ్చే అంగీకార పత్రమే కామన్ అండర్ టేకింగ్ అఫిడవిట్. జీవో నెంబర్ 168 ప్రకారం ఇక నుంచి నిర్మించే భవనాలకు ఇది వర్తిస్తుంది.

కామన్ అండర్ టేకింగ్ అంటే..

స్థల యజమానులు, బిల్డింగ్ ఆర్కిటెక్చర్, లైసెన్స్‌డ్ ఇంజనీరు, బిల్డర్.... ఇలా అందరూ కలిసి పురపాలక సంఘం కమిషనర్‌కు మేము మునిసిపల్ శాఖ నిబంధనలు అతిక్రమించకుండా, నిర్ధేశించిన నిబంధనలకు లోబడి, నాణ్యతా ప్రమాణాల ప్రకారమే నిర్మాణం చేపడతాం. ఒకవేళ నిబంధనలను అతిక్రమించి నిర్మాణం చేపట్టినట్లు ఉంటే భవిష్యత్తులో మునిసిపల్ అధికారులు తీసుకునే ఎలాంటి చట్ట ప్రకార చర్యలకైనా మేము లోబడి ఉంటామని సంయుక్తంగా రాసి ఇచ్చే అంగీకార పత్రం. ఈ విధంగా అండర్ టేకింగ్ ఇచ్చి పూర్తయిన నిర్మాణాలకే మునిసిపల్ అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తారు.

ఇబ్బందులు... సమస్యలు

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం వల్ల క్షేత్రస్థాయిలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సెట్‌బ్యాక్‌లు లేకపోవడం వల్ల కాలానుగుణంగా పెరిగే రద్దీకి రహదారులు సరిపోవడం లేదు. అగ్ని ప్రమాదాల వంటి విపత్తులు సంభవిస్తే ప్రాణనష్టం వాటిల్లుతుంది. కొన్ని అపార్ట్‌మెంట్లలో సెల్లార్లు, అదనపు అంతస్తుల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా కట్టేస్తున్నారు. అలాంటి వాటిల్లో ఫ్లాట్స్ కొనుగోలు చేసినా ఎలాంటి చట్టపరమైన రక్షణ లభించదు. అవి చట్ట ప్రకారం ఎక్కడ కూడా చెల్లుబాటు కావు. తెలియక కొనుగోలు చేస్తే ఆ తరువాత ఇబ్బందులు ఎదురవడం ఖాయం.

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ప్రాధాన్యం

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ రావడం ఇప్పటి నుంచి అంత సులభతరమేమీ కాదు. ప్రతి నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ ఇస్తారు. నిర్మాణానికి సంబంధించి ఎల్‌టీపీలు, యజమానులకే బాధ్యత ఉంటుంది. నిర్మాణం పూర్తయ్యాక నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయరు. ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేని నిర్మాణాలకు విద్యుత్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం మొదలగు మౌలిక సదుపాయాలు కూడా నిలిపేస్తారు. ఇక నుంచి యజమానులు అనుమతి ఏ విధంగా తీసుకుంటే అలాగే నిర్మించుకోవాల్సి ఉంటుంది. అలాగే క్రయ విక్రయాలు కూడా అంత సులభంగా నిర్వహించుకోలేరు. రుణాలు కూడా లభించవు.

గతంలోనే విధానం..

ఇప్పటి వరకు భవనాలు నిర్మించే యజమానులు రెండు రకాల ప్లాన్లు గీయించేవారు. మునిసిపల్ అధికారుల నుంచి అనుమతి తీసుకునేందుకు నిబంధల మేరకు ఒక ప్లాన్ వేయించే వారు. అయితే భవన నిర్మాణం మాత్రం తమకు నచ్చిన తీరులో నిర్మించుకునునేందుకు మరో ప్లాన్ వేయించుకునేవారు. ఈ విషయం అందిరికీ తెలిసిందే. అలా చేసినా తమకేం కాదని, ఒకవేళ అధికారులు వచ్చినా నిర్మాణం పూర్తయ్యాక ఏమి అనరనేది వారి ఆలోచన. అక్రమ నిర్మాణాలపై స్వీయ బాధ్యత లేకపోవడమే ప్రధాన కారణం. భవన నిర్మాణాలపైన కేవలం పట్టణ ప్రణాళిక అధికారులకే బాధ్యత ఉండేది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప వాటి గురించి పట్టించుకునే వారే లేరనేది అందరికీ తెలిసిందే..

అండర్ టేకింగ్‌లోని ముఖ్య నిబంధనలు

- ఎలాంటి నష్ట పరిహారం ఆశించకుండా సెట్‌బ్యాక్ నిబంధనల మేరకు రోడ్డు నిర్మించడం.
- ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ లేకుండా అద్దెకు ఇవ్వడం, విక్రయించడం వంటివి చెల్లనేరవు
- కనీసం మూడేళ్ల చెల్లుబాటయ్యే బిల్డింగ్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడం.
- బాల్కనీ, మెట్ల కింద ఎలాంటి కట్టడాలు నిర్మించకూడదు. ఒకవేళ ఉంటే నోటీసులు ఇవ్వకుండానే తొలగించే అధికారం మునిసిపల్ అధికారులకు ఉంటుంది.
- తీసుకున్న అనుమతుల కంటే ఎక్కువ నిర్మాణాలు చేయకూడదు.
- ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించాలి.

నిర్మాణదారులదే పూర్తి బాధ్యత



కొత్తగా నిర్మించే ఇళ్లకు, వాణిజ్య భవనాలకు ఇక నుంచి కామన్ అండర్ టేకింగ్ ఆఫిడవిట్ తప్పనిసరి. అప్లికేషన్ సమయంలోనే దీనిని తీసుకుంటాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే నోటీసులు ఇవ్వకుండానే కూల్చేసే అంగీకారాన్ని అప్పగిస్తూ ఆఫిడవిట్ ఇస్తారు. యజమానులకు ఎల్‌టీపీలకు, బిల్డర్లకే నిర్మాణాలపై పూర్తి బాధ్యత ఉంటుంది.

- మాధవి, టౌన్ ప్లానింగ్ అధికారి, వికారాబాద్ మునిసిపాలిటీ

ఉనికి కోల్పోయిన తనిఖీ

- లోపిస్తున్న జవాబుదారీతనం
- నామమాత్రంగా ఎస్‌ఎంసీ కమిటీలు
- అవగాహన లేక పట్టుకోల్పోతున్న కమిటీలు
- జిల్లా వ్యాప్తంగా ఇదే తీరు

వికారాబాద్: ప్రజల భాగస్వామ్యం లేకుండా ఎందులోనూ పురోగతి ఉండదు. సమిష్టి కృషితోనే ఆశించిన ఫలితాలు ఉంటాయి. ఇందులో భాగంగానే పాఠశాల యాజమాన్య కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ కమిటీలను ఎంపిక చేశారు. కమిటీలను సమన్వయం చేసుకుంటూ సర్వశిక్ష అభియాన్ ద్వారా ఆయా పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలి. పాఠశాలల పనితీరు, మౌళిక వసతుల కల్పన, విద్యాభివృద్ధి తదితర అంశాలకు సంబంధించి పాఠశాల యాజమాన్య కమిటీలు సమావేశమై చర్చించాల్సి ఉంటుంది. అయితే క్షేత్ర స్థాయిలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. పాఠశాలల అభివృద్ధికి ఏర్పాటైన పాఠశాల యాజమాన్య కమిటీలు నామ మాత్రంగా మారాయి. జిల్లా వ్యాప్తంగా 1029 పాఠశాలలు పనిచేస్తున్నాయి. 736 ప్రాథమిక, 121 ప్రాథమికొన్నత, 161 ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలలు, 9 తెలంగాణ ఆదర్శ పాఠశాలలు, 18 కేజీబీవీ, 9 ఎయిడెడ్, 11 గురుకుల పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఈ పాఠశాలల్లో లక్ష మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

కరువైన పర్యవేక్షణ...

తమ పాఠశాలలో ఎలాంటి సదుపాయాలు అవసరం ఉన్నాయి. ఏయే పనులు చేపట్టాల్సి ఉంది. పాఠశాల అభివృద్ధికి ఎలాంటి పథకాలు ప్రభుత్వం అమలు చేస్తోందనే పూర్తి సమాచారం కమిటీలకు ఉండాలి. పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ఎంత ఖర్చు చేశారనే సమాచారం కమిటీలకు అవగాహన ఉండాలి. అదే సమయంలో సిబ్బంది, వారి పనితీరు, విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన, తరగతి గదుల నిర్వహణ, హాజరు శాతం పెంపు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం తదితర విషయాలకు సంబంధించి సమగ్ర సమాచారం ఉండాలి. ఈ అంశాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రతి నెలలో మూడో శనివారం విధిగా సమావేశం నిర్వహించాలి. పాఠశాలల అభివృద్ధికి సంబంధించి చర్చ జరగాలి. అందుకు కావాల్సిన నిధుల కోసం నివేదికలు సిద్ధం చేయాలి. అయితే జిల్లాలో ఇలాంటి సమావేశాలు జరగడం లేదు. ఎక్కడైనా జరిగితే అది నామమాత్రంగానే ఉంటుంది. మహిళా ఎస్‌ఎంసీ చైర్మన్లు కొనసాగుతున్న చోటవారి భర్తలతో, లేదా సహాయకుల పెత్తనమో ఉంటోంది.

శిక్షణనే మరిచారు...

పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)లకు సమగ్ర శిక్షణ ఇవ్వడం విస్మరించారు. ఎస్‌ఎంసీల బాధ్యతలు, నిర్వహించాల్సిన విధులు తదితర అంశాలపైన నేటికీ పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడం గమనార్హం. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సమావేశాలు నిర్వహించామని రికార్డుల్లో నమోదు చేసుకున్న అధికారులు సభ్యులకు వారి బాధ్యతలపై సరైన అవగాహన కల్పించలేకపోయారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో యాజమాన్య కమిటీలు ఏర్పాటయ్యాయి. ప్రతి తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులను సభ్యులుగా ఎన్నుకుంటారు. పాఠశాల స్థాయిలో ఏర్పాటయ్యే యాజమాన్య కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్, ఎనిమిది మంది సభ్యులు ఉంటారు. కమిటీ కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయుడు వ్యవహరిస్తారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీపీ, మునిసిపల్ చైర్మన్ తమ విచక్షణ మేరకు పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉంటుంది. అయితే జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఇలాంటి సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు.

బహుళ ప్రయోజనాలు...

ఎస్‌ఎంసీల పనితీరు మెరుగుపడితే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందనే అవగాహన ప్రజలు తల్లిదండ్రుల్లో పెరుగుతుంది. ప్రధానోపాధ్యాయులలో జవాబుదారీతనం పెరుగుతుంది. ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపడుతుంది.



మద్గుల్ చిట్టంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

మా హక్కులను ఆర్‌టీఐతో తెలుసుకున్నా...



విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రతి పాఠశాలలో ఎస్‌ఎంసీ కమిటీలను ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. ఎస్‌ఎంసీలకు సరైన అవగాహనను అధికారులు కల్పించడం లేదు. ఎస్‌ఎంసీ ఎన్నికల తరువాత అధికారులు ఒకసారి మాత్రం నామ మాత్రంగా శిక్షణ తరగతులు నిర్వహించి చేతులు దులుపేసుకున్నారు. మాకున్న హక్కులు, బాధ్యతల గురించి ఆర్‌టీఐ ద్వారా తెలుసుకున్నా.

- నాగభూషణం, తెలంగాణ రాష్ట్ర తల్లిదండ్రుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎస్‌ఎంసీలు చురుగ్గా వ్యవహరించాలి....



పాఠశాల యాజమాన్య కమిటీలు తమ హక్కులను తెలుసుకోవాలి. పాఠశాల కార్యకలాపాల్లో చురుకుగా వ్యవహరిస్తూ లోపాలు సరిచేయాలి. సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఎస్‌ఎంసీలకు ప్రణాళికాబద్ధంగా శిక్షణ ఇవ్వాలి. నామమాత్రంగా శిక్షణ ఇచ్చి చేతులు దులుపేసుకోవడం సరికాదు. ఎస్‌ఎంసీలకు వారి విధులు, బాధ్యతలపై అవగాహన పెంచేలా సదస్సులు నిర్వహించాలి. పాఠశాల పర్యవేక్షణ, మధ్యాహ్న భోజనం వంటివి ఎప్పటికప్పుడు ఎస్‌ఎంసీ సభ్యులు పర్యవేక్షిస్తే బాగుంటుంది.

- విఠల్, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

వైద్యులే లేరు.. ప్రసవాలెలా.?

- సౌకర్యాలు తక్కువ.. ప్రచారం ఎక్కువ
- బషీరాబాద్ పీహెచ్‌సీలో పెరుగుతున్న ప్రసవాల సంఖ్య
- సాధారణ చికిత్సలు, ప్రసవాలకు ఒక కాంట్రాక్టర్ వైద్యుడే దిక్కు
- రాత్రుల్లో ఆస్పత్రికి వస్తే గర్భిణులకు నరకమే
- పరిస్థితి విషమిస్తే తాండూరు జిల్లా ఆస్పత్రికి రెఫర్



బషీరాబాద్ పీహెచ్‌సీ నుంచి అంబులెన్స్‌లో గర్భిణిని తరలిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఆసుపత్రి ప్రసవాలే సురక్షితమని సర్కారు దవాఖానాలను వినియోగించుకోవాలని మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు క్షేత్ర స్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దీనికి తోడు అమ్మఒడి పథకాన్ని ప్రారంభించి ప్రభుత్వ ఆసుపత్రిలో పుట్టిన శిశువులకు కేసీఆర్ కిట్లు అందించే దిశగా చర్యలు చేపట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నా సంబంధిత వైద్య నిపుణుల కొరతను మాత్రం సర్కారు పట్టించుకోవడం లేదు. కాన్పు కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు పరిస్థితి విషమిస్తే నైపుణ్యం లేని వైద్య సిబ్బంది చేతులెత్తేస్తున్న దుస్థితి బషీరాబాద్ పీహెచ్‌సీలో చోటు చేసుకుంటున్నాయి.

బషీరాబాద్: బషీరాబాద్ మండలం నుంచి తాండూరు పట్టణంలోని జిల్లా ఆసుపత్రి 24 కిలోమీటర్లు ఉండగా, అంబులెన్స్‌కు కనీసం అరగంటకు పైగా సమయం పడుతోంది. ఈ వ్యవధిలో పరిస్థితి విషమిస్తే కడుపులో బిడ్డతో పాటు గర్భిణికీ ప్రమాదమే. ఇలాంటి పరిస్థితినే సరిహద్దు మండలమైన బషీరాబాద్ ప్రాంత వివిధ గ్రామాల గర్భిణులు నిత్యం ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు, మారుమూల ప్రాంతం బషీరాబాద్ మండలంలో 16గ్రామ పంచాయతీలుండగా సుమారు 50 వేలకు పైగా జనాభా ఇక్కడా ఉన్నారు. ఇక్కడి ప్రాంతంలో బషీరాబాద్, నవాల్గ గ్రామాల పరిధిలో రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. కాగా బషీరాబాద్ పీహెచ్‌సీలో మాత్రమే ప్రసవాలు చేస్తున్నారు.

ఇదిలా ఉండగా ఆయా గ్రామాల నుంచి గర్భిణులు పెద్ద సంఖ్యలో ప్రసవానికి ఇక్కడికే వస్తారు. ఇక్కడి ఆసుపత్రిలో ఒకేఒక కాంట్రాక్ట్ వైద్యులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. స్త్రీ వైద్య నిపుణురాలు (గైనకాలజిస్టు) ఇతరత్ర వైద్యులు ఎవరూ ఇక్కడ లేరు. దీంతో ప్రసవాలు సుఖావంతంగా జరిగేలా ఉంటే ఇక్కడ ఆసుపత్రిలో గర్భిణులకు కాన్పులు చేస్తున్నారు. గర్భిణుల్లో రక్తహీనత, ఇతరేత్ర ఇబ్బందికారంగా పరిస్థితులుంటే వెంటనే తాండూరు జిల్లా ఆసుపత్రి నుంచి 108 అంబులెన్స్ రప్పించి అక్కడికి రెఫర్ చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇక్కడ పూర్తి స్థాయిలో వైద్యులు లేక గర్భిణులు నరకం చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఆసుపత్రి 24 గంటలు కొనసాగుతున్నా, అన్నీ సౌకర్యాలు ఉన్నప్పటికీ వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. ఒకేఒక వైద్యులు ఉండటంతో పగాలు ఆసుపత్రిలో విధులు నిర్వర్తించి ఇంటికి వెళ్లిపోతున్నారు. ఆ తరవాత ఆసుపత్రిలో నర్సు, ఒక ఏఎన్‌ఎం మాత్రమే విధుల్లో ఉంటూ నెట్టుకొస్తున్నారు. ఈ సమయంలో ఎవరైనా గర్భిణులు ఇక్కడి కాన్పు కోసం వస్తే వైద్య సిబ్బంది వీరికున్న నైపుణ్యంతో పరిస్థితిని చూసి చేసేదేమిలేక అంబులెన్స్‌ను పిలిపించి జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. ఈ ఆస్పత్రిలో కనీసం నలుగురు వైద్యులు, ఆరుగురు స్టాఫ్ నర్సులు అవసరం. కాగా, ఒకేఒక వైద్యులు కాంట్రాక్ట్ పద్ధతిన కొనసాగుతుండగా, ఇద్దరు స్టాఫ్ నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. ఫార్మ సిస్టు పోస్టు ఖాళీగా ఉంది. నామమాత్రంగా ఉన్న సిబ్బందితో కొంతకాలంగా ఆస్పత్రిని నెట్టుకొస్తున్నారు. ఇటీవలి కాలంలో ప్రసవాల సంఖ్య ఆస్పత్రిలో పెరగడంతో ఇక్కడి వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నాలుగు రోజుల కిందట ముగ్గురు గర్భిణులు పురిటి నొప్పులతో ఆసుపత్రికి రాగా వైద్య సిబ్బంది కొరతతో ఒకరికి కాన్పు చేసి, మరో ఇద్దరిని జిల్లా ఆసుపత్రికి పంపించాల్సి వచ్చింది. ఈ ఆస్పత్రి 24 గంటలు కొనసాగించేందుకు అవసరమైన వైద్యులను నియమించాలని పలుమార్లు వైద్య శాఖ ఉన్నతాధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతుందని మండలంలోని ప్రజా ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల ఆసుపత్రిలో ప్రసవించిన బాలింతకు కేసీఆర్ కిట్ ఇస్తున్న వైద్యులు

వైద్యుల కొరత ఉన్నా ప్రసవాలు చేస్తున్నాం



పీహెచ్‌సీలో ప్రసవాల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రస్తుతం గర్భిణుల సంఖ్య పెరిగింది. గతంలో ఒకటి రెండు ప్రసవాలు జరిగేవి. అమ్మఒడి, కేసీఆర్ కిట్‌ను ప్రభుత్వం అందజేస్తుండటంపై 24 గంటలు ఆస్పత్రిని కొనసాగిస్తుండటంపై గర్భిణుల సంఖ్య కూడా భారీగానే పెరుగుతుంది. ఆస్పత్రిలో కనీసం నలుగురు వైద్యులు, ఆరుగురు స్టాఫ్ నర్సులు ఉండాలి. ఇద్దరు స్టాఫ్‌నర్సులు ప్రస్తుతం పని చేస్తున్నారు. ఫార్మసిస్టు పోస్టు, ఇతర పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. వీలైనంత వరకు వైద్య సేవలందిస్తున్నాము. గర్భిణుల విషయంలో ప్రసవాల తేదీ సమీపిస్తే ముందస్తుగా రాత్రికి ఆస్పత్రిలో ఉండి సేవలందిస్తున్నాము. ప్రతినెలా 12 వరకు ప్రసవాలు చేస్తున్నాము.

- అరవింద్‌కుమార్‌జీ, వైద్యుడు, పీహెచ్‌సీ, బషీరాబాద్

శిథిల బడులు

- పెచ్చులూడి సీకులు తేలిన భవనాలు
- పీడిస్తున్న తరగతి గదుల కొరత
- వరండాలు, చెట్లకిందే చదువులు
- ఆందోళనలో తల్లిదండ్రులు



వరండాలో చదువుకుంటున్న విద్యార్థులు (ఇన్‌సెట్లో) పెచ్చులూడిపోయి తేలిన ఇనుప చువ్వలు

కొందుర్గు: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తామని పాలకులు పదేపదే చెబుతున్నా.. కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఇలాంటి పాఠశాలల్లో పిల్లల చదువులపై వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కొందుర్గు మండలంలో 15 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 23 ప్రాథమిక పాఠశాలలు, 8ప్రాథమికోన్నత పాఠశాలలు, రెండు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. జిల్లేడ్-చౌదరిగూడ మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో 28 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 4 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. జిల్లేడ్ -చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్‌లో చౌదరిగూడ, కొందుర్గు కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. రెండు మండలాల్లోని 74 పాఠశాలల్లో 6280 మంది విద్యార్థులుండగా వారికి 169 మంది ఉపా ధ్యాయులు, 21 మంది విద్యా వాలంటీర్లు విద్యాబోధన చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా పాఠశాల భవనాలు

కొందుర్గు, జిల్లేడ్-చౌదరిగూడ మండలాల్లోని రేగడి చిల్కమర్రి, పర్వతాపూర్, వీరన్నపేట్, తూంపల్లి, చేగిరెడ్డిఘనాపూర్, ఇంద్రానగర్, పీర్జాపూర్, బైరంపల్లి గ్రామాల్లోని పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దాదాపు అన్ని పాఠశాలల్లో గదుల సమస్య తీవ్రంగా ఉంది. మండల పరిధిలోని రేగడి చిల్రమర్రిలో 1975లో రెండు గదులతో భవనాలు నిర్మించి ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న ఐదు తరగతుల్లో మొత్తం 68 మంది విద్యార్థులుండగా వారికి ముగ్గురు ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. ఐదు తరగతులకు గాను కేవలం మూడు గదులే ఉన్నాయి. వీటిల్లో రెండు గదులు శిథిలావస్థకు చేరడంతో పాఠశాలలో గదుల కొరత ఏర్పడింది.

దీంతో ఒక గది లో రెండు తరగతులను, వరండాలో రెండు తరగదులను, మరో తరగతి విద్యార్థులను చెట్ల కింద కూర్చోబెట్టి విద్యాబోధన చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన రెండు గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టి విద్యాబోధన చేయాలంటే ఉపాధ్యాయులు జంకుతున్నారు. పాఠశాల పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల శిథిలావస్థ గురించి అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలకు నూతన భవనాలు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు తెలియజేశాం



శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం గురించి అధికారులకు తెలియజేశాం. అలాగే డైస్‌ఫాంలో కూడా గదుల వివరాలను తెలియజేశాం. వెంటనే పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయాలి.

- శేఖర్‌గౌడ్, ప్రధానోపాధ్యాయుడు, రేగడి చిల్కమర్రి

పిల్లలను పంపాలంటే భయమవుతోంది



పాఠశాలలో రెండు గదులు శిథాలావస్థకు చేరడంతో పాఠశాలకు పిల్లలను పంపాలంటే భయమవుతుంది. తప్పని పరిస్థితుల్లో పంపుతున్నాం. ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రతిరోజు ఆందోళనకు గురవుతున్నాం.

- రాములు, రేగడి చిల్కమర్రి

నాలుగు సంవత్సరాలుగా వినతులు ఇస్తున్నాం



నాలుగు సంవత్సరాలుగా శిథిలమైపోయిన పాఠశాల భవనం గురించి ఆర్‌వీఎం అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తున్నాం. నూతన భవనాన్ని మంజూరు చేయాలి.

- పురుషోత్తంరెడ్డి, సర్పంచ్, రేగడి చిల్కమర్రి

India's largest trade partner?

Current Affairs & GK

1. **Justice Deepak Mishra, 45th Chief Justice of India, will assume office on…..**
1) 27 August 2017 2) 28 August 2017
3) 29 August 2017 4) 30 August 2017
5) 31 August 2017

2. **Who is the President of Kenya re-elected for second term in the August 2017 general elections?**
1) Uhuru Kenyatta
2) Muhammadu Buhari 3) Jacob Zuma
4) Robert Mugabe 5) None of these

3. **Ruth Pfau, popularly known as Pakistan's Mother Teresa has passed away. She hailed from which country?**
1) Switzerland 2) South Sudan
3) South Africa 4) Saudi Arabia
5) Germany

4. **Name the countries for first time are going to conduct Indra tri-services exercise, involving their armies, navies and the air forces in October 2017 to further ramp up military ties?**
1) India and USA 2) India and UK
3) India and Russia 4) India and China
5) India and Japan

5. **Usain Bolt announced retirement to athletics recently. He is widely considered to be the greatest sprinter of all time. He belongs to ……**
1) Jamaica 2) Kenya 3) Zimbabwe
4) Brazil 5) None of these

6. **Who was served as the Returning Officer for the 15th Presidential election held on 17 July 2017?**
1) Anoop Mishra 2) Shumsher K. Sheriff
3) Hamid Ansari 4) Sumitra Mahajan
5) None of the above

7. **Which of the following lines forms border between North Korea and South Korea?**
